# ప్రజా తపన

prajathapana.com

News that matters




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక: 55 మంగళవారం 11 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




# 9 ఏళ్లలో స్టార్టప్‌లు 300 రెట్లు పెరిగాయి

### కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

**ప్రజాతపన , న్యూఢిల్లీ :**

కేంద్ర సైన్స్ & టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత)బీకేంద్ర ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత)బీ ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో స్టార్టప్‌లు గత 9 సంవత్సరాలలో 300 రెట్లు పెరిగాయని అన్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. కేంద్ర సైన్స్ & టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "నేషనల్ ఇన్నోవేషన్ అవార్డు" కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము "గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్స్"ను ప్రదానం చేశారు.

2014కి ముందు దేశంలో దాదాపు 350 స్టార్టప్‌లు ఉండేవని అయితే 2016లో ప్రధాని నరేంద్ర మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఎర్రకోట నుండి స్పష్టమైన పిలుపునిచ్చి 2016లో ప్రత్యేక స్టార్టప్ స్కీమ్‌ను ప్రారంభించిన తర్వాత వాటి సంఖ్య గణనీయంగా 90,000కు పైగా పెరిగిందని మంత్రి చెప్పారు. ఈ స్టార్టప్‌లలో 100 కంటే ఎక్కువ యునికార్న్ సంస్థలున్నాయి.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ..ప్రధాని మోదీ ఏకకాలంలో ప్రైవేట్ భాగస్వామ్యం కోసం అంతరిక్ష రంగాన్ని ప్రారంభించారని ఆ చర్య కేవలం మూడేళ్లలో అంతరిక్ష రంగంలో 100 కంటే ఎక్కువ స్టార్టప్‌లకు దారితీసిందని అన్నారు. అదేవిధంగా బయోటెక్ స్టార్టప్‌లు దాదాపు 50 నుండి సుమారు 6,000 వరకు పెరిగాయని ఆయన చెప్పారు.

భారత్ యువతలో ప్రతిభ, సామర్థ్యం, ఆవిష్కరణలు, సృజనాత్మకతలకు కొదవ లేదని అయితే వారికి అనుకూలమైన వాతావరణం, సరైన ప్రోత్సాహం


(మిగతా 2లో)


# ఎర్రచందనంపై తొలిసారిగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం

### ఎర్రచందనం స్మగ్లింగ్ పై సిబిఐ విచారణ వివరాలు కోరిన కేంద్రం



**ప్రజాతపన, బద్వేలు**

రాష్ట్రంలోని తిరుమల శేషాచలం అడవులతో పాటు బద్వేలు మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని లంక మల్ల అభయారణ్యంలో తోపాటు అనేక ప్రాంతాల్లో అక్రమంగా ఎర్రచందనం స్మగ్లింగ్, చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సీబీఐ విచారణ చేపట్టాలని 22-2-23న న్యూఢిల్లీలో కేంద్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ కు ఒకరు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా తీవ్రంగా స్పందించి ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరాలు అందజేయాలని అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ శివానంద్ ఎస్ తలావార్


(మిగతా 2లో)




# ప్రధాని మోడీ భేష్

### ప్రశంసించిన ఇమ్రాన్ ఖాన్

**ప్రజాతపన . ఇస్లామాబాద్ :**


పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మరోసారి భారత ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ఇండియా అనుసరిస్తున్న విదేశాంగ విధానాన్ని పొగిడారు. రష్యా నుంచి చీప్ క్రూడ్ ఆయిల్‌ను కొనుగోలు చేయడం సాధారణ విషయం కాదని, భారత్ ఇది సాధించిందని అన్నారు. దేశ ప్రజల్ని ఉద్దేశిస్తూ ఓ వీడియో విడుదల చేసిన ఆయన...తన హయాంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించినట్టు వివరించారు


(మిగతా 2లో)


# కోల్ కత్తాలో అండర్ వాటర్ మెట్రో

### కిలో మీటరుకు 157 కోట్లు

**ప్రజాతపన, కోల్ కత్తా :**



1984లో భారత్‌లో తొలి మెట్రో సర్వీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి రైల్వే శాఖలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్నో కొత్త ట్రైన్ సర్వీస్‌లు స్టార్ట్ అయ్యాయి. కొత్తగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లూ పట్టాలెక్కాయి. ఇప్పుడు మరో అతి పెద్ద ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. దేశంలోని తొలిసారి అండర్ వాటర్ మెట్రో ట్రైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సర్వీస్‌లు మొదలు కానున్నట్టు గతంలోనే రైల్వే మంత్రి ప్రకటించారు. దేశంలోనే తొలి అండర్?వాటర్? మెట్రోగా ఇది రికార్డు సృష్టిస్తుందని స్పష్టం చేశారు. ఇదో ఇంజనీరింగ్ అద్భుతంగా నిలిచిపోతుందని వెల్లడించారు. హుగ్లీ నది కింద ఇప్పటికే పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే...అండర్ వాటర్ టన్నెల్‌లో 6 కోచ్‌లున్న రెండు మెట్రో ట్రైన్‌లను ఈ రోజు (ఏప్రిల్ 9) న టెస్ట్ రన్ చేసేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. కోల్‌కత్తా ఈస్ట్ వెస్ట్ మెట్రో ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఈ అండర్‌వాటర్ మెట్రోను ఈస్ట్-వెస్ట్ కారిడర్ ప్రాజెక్టుగా వ్యవహరిస్తున్నారు. సాల్ట్ లేక్ నుంచి హౌరా వరకూ ఈ మెట్రో సర్వీస్‌లు ఉంటాయి. వయా హౌరా ఇది దూసుకుపోతుంది. నిజానికి ఇప్పటికే ఈ పనులు పూర్తవ్వాల్సి ఉంది. కానీ మధ్య మధ్యలో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి. టన్నెల్ నిర్మాణం కారణంగా నదీ పరిసరాల్లోని ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. వీటితో పాటు మరికొన్ని టెక్నికల్ సమస్యలూ రావడం వల్ల పనులు ఆలస్యమవుతూ వచ్చాయి. ప్రజలు


(మిగతా 2లో)




# కోడి కత్తి కేసు విచారణకు సిఎం జగన్ పీఏ హాజరు

**ప్రజాతపన, విజయవాడ :**

విశాఖపట్నం విమానాశ్రయంలో సీఎం జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన కోడికత్తి దాడి కేసుపై విజయవాడ ఎన్ఐఏ కోర్టులో నేడు విచారణ జరిగింది. ఈ కేసులో సాక్షి, బాధితుడిగా


(మిగతా 2లో)


# స్టీల్ ప్లాంట్ కు తెలంగాణ సర్కార్ బిడ్డింగ్

**ప్రజాతపన, హైదరాబాద్ :**



కేంద్ర ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ కార్యచరణ ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఇప్పటికే స్టేట్మెంట్ ప్రకటించింది. కేంద్రం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ చేసింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కోనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. బిడ్డింగ్ లో పాల్గొనేందుకు కసరత్తు చేస్తుంది. జేఎస్ రంజన్ నేతృత్వంలో బిడ్డింగ్ కు ప్లాన్ చేస్తున్నారు అధికారులు. తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బిడ్డింగ్‌కు ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలో సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకించిన బీఆర్ఎస్..


(మిగతా 2లో)


# బీఆర్ఎస్ నుంచి పొంగులేటీ, జూపల్లి సస్పెండ్

**ప్రజాతపన, హైదరాబాద్ :**





పార్టీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణరావును పార్టీ నుంచి బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. ఆత్మీయ సమ్మేళనంలో కేసీఆర్, బీఆర్ఎస్ పై పొంగులేటి, జూపల్లిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే ఈ ఇద్దరి నాయకులపై పార్టీ తీవ్ర నిర్ణయం తీసుకుంది. కొన్ని రోజులుగా ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ప్రభుత్వంపై, బీఆర్ఎస్ అధినాయకత్వంపై విమర్శల తుపాకులు ఎక్కుపెట్టి బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. పార్టీ తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిసినప్పటి నుంచి ప్రజల్లో ఉంటూ అధినాయకత్వానికి పంటికింద రాయిలా మారారు. ఆదివారం కూడా కొత్తగూడెంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కొత్తగూడెంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేసిన సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మరో అంసతృప్తి బీఆర్ఎస్ నేత జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఇద్దర అసంతృప్త సీనియర్


(మిగతా 2లో)

# 9 ఏళ్లలో స్టార్టప్‌లు 300 రెట్లు పెరిగాయి

(మొదటిపేజీ తరువాయి)

లభించ లేదని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. మన గ్రామీణ యువతలో కూడా అపారమైన ప్రతిభ ఉంది. అధికారిక విద్య డిగ్రీ మరియు ఆవిష్కరణ సామర్థ్యాల మధ్య ఎటువంటి సంబంధం లేదు.అది ఈ రోజు ఇచ్చిన అవార్డుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అకడమిక్ డిగ్రీలకే కాకుండా నైపుణ్యానికి ప్రాధాన్యతనిచ్చే జాతీయ విద్యా విధానం 2020ని తీసుకురావడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని ప్రధాని మోదీ కోరినట్లు ఆయన తెలిపారు.

ఇవ్వబడిన అవార్డుల స్వభావం మరియు అవార్డు గ్రహీతల ప్రొఫైల్ పరిశీలిస్తే భారతదేశంలో పెద్ద సంఖ్యలో "గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లు" అందుబాటులో ఉన్నారని రుజువు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. వారు అధికారిక ఉన్నత విద్యను కలిగి ఉండకపోవచ్చు..కానీ విజయవంతమైన కథలను సృష్టించడం వారి జీవనోపాధికి ఆకర్షణీయమైన మార్గాలను రూపొందించుకోవడం వంటి సామర్థ్యాలు వారికి ఉన్నాయి. "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్" (ఫైన్) నిర్వహణ కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం మరియు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) చేస్తున్న కృషిని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్‌లను కూడా ప్రోత్సహించడానికి ఇది ఒక ప్రత్యేకమైన ప్రయత్నం అని పేర్కొన్నారు. అధికారిక కోణంలో ఉన్నత విద్యను అభ్యసించని వారు లేదా సైన్స్ విద్యార్థులు కానివారు కూడా స్వాభావికమైన ప్రతిభను మరియు ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకత కోసం సహజమైన అభిరుచిని కలిగి ఉంటారు. ఇది వారి జీవనోపాధికి మూలం కూడా కావచ్చు.జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి, విద్యార్థి విభాగంలో వివిధ విభాగాల్లో అవార్డులను ప్రదానం చేశారు. ఈరోజు అవార్డు గ్రహీతలలో ఇద్దరు ఇప్పటికే తమ ఆవిష్కరణలకు పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

# ఎర్రచందనంపై తొలిసారిగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ఎర్రచందనం శేషాచలం అడవులతో పాటు కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో విస్తరించి ఉంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవహారాలను నిర్వహించడానికి తిరుమల- తిరుపతి దేవస్థానం స్థాపించబడినది. టీటీడీ ముఖ్యమైన ఆస్తుల్లో శేషాచలం అడవులు ఒకటి. అంతర్జాతీయంగా ఎర్రచందనంకు విలువ అధికంగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం అడవుల్లో ఎర్రచందనం నరకి, స్మగ్లింగ్ కార్యకలాపాల ద్వారా పర్యావరణ వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ అక్రమ వ్యాపారంవల్ల నేరాలు పెరగడం, ఉగ్రవాదానికి నిధులు వెళ్తున్నట్లు ఉన్న అనుమానాలతో ఇది దేశ భద్రతకు ముప్పు కలిగిస్తుందని, వెంటనే స్మగ్లింగ్ అరికట్టి, స్మగ్లర్లను కఠినంగా శిక్షించేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. వెంకటేశ్వర స్వామికి చెందిన వేలకోట్ల ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టడానికి, అక్రమ కార్యకలాపాలను వెలికి తీసి క్లిష్టమైన ఈ సమస్యను పరిష్కరించేందుకు సీబీఐ విచారణకు ఆదేశించాలని మంత్రిని కోరగా మంత్రి భూపేంద్ర యాదవ్ తీవ్రంగా స్పందించడం అభినందనీయం. ఫిర్యాదు మేరకు న్యూఢిల్లీ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ శివానంద ఎస్ తలావార్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వారికి వివరాలు కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్ ను అరికట్టడంలో ప్రస్తుతం ఉన్న చట్టాలు, నియమాలు, నిబంధనలు పరిశీలించి మీరు తీసుకున్న చర్యలను, ప్రాథమిక వివరాలను కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపాలని ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం మొట్టమొదటిసారిగా ఎర్రచందనం స్మగ్లింగ్ పై విచారణ కోరడం హర్షనీయం . రాష్ట్ర ప్రభుత్వ వివరాల మేరకు త్వరలోనే సిబిఐ విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం జరుగుతుందని, ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించి, శేషాచలం అడవులను కాపాడేందుకు ఇది తొలిమెట్టు.

# ప్రధాని మోడీ భేష్

(మొదటిపేజీ తరువాయి)

కానీ అనుకోకుండా తన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడం వల్ల అది కుదరలేదని అసహనం వ్యక్తం చేశారు. "భారత్ లాగే పాకిస్థాన్ కూడా రష్యా నుంచి చీప్ క్రూడ్ ఆయిల్‌ను కొనుగోలు చేయాల్సింది. నా హయాంలో ఈ ప్రయత్నం జరిగింది. కానీ దురదృష్టవశాత్తూ మా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఉన్నట్టుండి మా గవర్నమెంట్ కూలిపోయింది. అందుకే ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయాం. ప్రస్తుతం మా దేశం సంక్షోభంలోకి కూరుకుపోయింది. కనీసం ఇప్పుడైనా రష్యా నుంచి తక్కువ ధరకే క్రూడాయిల్‌ను కొనుగోలు చేయొచ్చు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అలా చేయలేకపోతోంది "గతంలోనూ ఇమ్రాన్ ఇదే విషయంలో భారత్‌ను పొగిడారు. అమెరికా ఎంత ఒత్తిడి చేసినప్పటికీ పట్టించుకోకుండా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం అసాధారణ విషయం అంటూ ప్రశంసించారు. ఇప్పుడు మరోసారి అభినందించారు. ప్రధాని మోదీని కూడా ఓ సారి ఆకాశానికెత్తేశారు ఇమ్రాన్. నవాజ్ షరీఫ్‌కు అన్ని కోట్ల ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నిస్తూనే...ప్రధాని మోదీ పేరుని ప్రస్తావించారు. "పొరుగు దేశమైన భారత ప్రధాని మోదీ ఆస్తి ఎంత..? మీకు మాత్రం ఇంత ఆస్తి ఎలా వచ్చింది" అంటూ నవాజ్ షరీఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అంతర్జాతీయంగా ముడి చమురుకు కొరత ఏర్పడుతోంది. గతేడాది ఫిబ్రవరిలో ఇమ్రాన్ ఖాన్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. అప్పుడే పాకిస్థాన్‌ను టార్గెట్ చేశాయి పశ్చిమ దేశాలు. ప్రపంచ దేశాలన్నీ రష్యా చర్యల్ని ఖండిస్తుంటే...పాక్ మాత్రం రష్యాతో అంటకాగుతోందంటూ మండి పడ్డాయి. ఒకవేళ ఇమ్రాన్ ఖాన్..పుతిన్‌తో భేటీ కాకపోయుంటే పరిస్థితులు మరీ ఇంత దారుణంగా ఉండేవి కావని అంటున్నారు కొందరు నిపుణులు. ఈ పర్యటన తరవాతే అమెరికా పాక్‌పై ఒత్తిడి పెంచింది. ఫలితంగా పాక్ ఆర్మీ చీఫ్ ఇమ్రాన్‌పై అసహనం వ్యక్తం చేయాల్సి వచ్చింది. ఆ తరవాత జరిగిన వరుస పరిణామాలు ఆయనను గద్దె దించాయి. ఇదంతా కుట్ర ప్రకారమే జరిగిందని ఇమ్రాన్ ఎంతగా ఆరోపించిన చేతులారా ఆయనే చేసుకున్నారని అంటున్నారు కొందరు ఎక్స్‌పర్ట్స్. ఇప్పుడు మరోసారి ప్రధాని కావాలని ఆరాట పడుతున్నారు. కానీ ఆ కల తీరేలా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయనపై కేసులు నమోదు చేసి ఎక్కడికక్కడ కట్టి పడేశారు. జైల్లోనే ఉంచేందుకు షెహబాజ్ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది.

# కోడి కత్తి కేసు విచారణకు సిఎం జగన్ పీఏ హాజరు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న సీఎం జగన్ కచ్చితంగా కోర్టుకు హాజరు కావాలని గత వాయిదా సందర్భంగా మేజిస్ట్రేట్ పేర్కొన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పర్సనల్ పీఏ కోర్టుకు హాజరయ్యారు. అడ్వకేట్ కమిషనర్ ద్వారా సాక్ష్యం నమోదుకు సీఎం జగన్ పిటిషన్ వేశారు. ఇప్పటికే ఎన్ఏఐ కోర్టులో సీఎం జగన్ రెండు పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే రాష్ట్రానికి సీఎంగా బాధ్యతల నిర్వహణ ఉందని పిటిషన్‌లో వెల్లడించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమాల సమీక్షలు ఉన్నాయని వివరించారు. తాను కోర్టుకు హాజరైతే భద్రత కోసం వచ్చే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని పిటిషన్ లో పేర్కొన్నారు. అందుకోసమే అడ్వకేట్ కమిషనర్‌ను నియమించి ఆయన సమక్షంలో సాక్ష్యం నమోదుకు అభ్యర్థించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లేదా ఇతర మార్గాల ద్వారా సాక్ష్యం నమోదుకు వీలు కల్పించాలని కోరారు. పిటిషన్ ను పరిశీలించిన న్యాయమూర్తి విచారణ షెడ్యూల్‌ను రద్దు చేశారు. విచారణను ఈనెల 13కు వాయిదా వేశారు. అలాగే దర్యాప్తు లోతుగా జరపాలంటూ జగన్ మరో పిటిషన్ కూడా వేశారు. సీఎం పిటిషన్లపై ఈనెల 13న విచారణ జరుపుతామని ఎన్ఐఏ కోర్టు వివరించింది. 2018 అక్టోబర్ 25న 294వ రోజు పాదయాత్ర ముగించుకొని వైఎస్ జగన్ హైదరాబాద్ తిరిగి వచ్చేందుకు విశాఖపట్నం విమానాశ్రయం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వీఐపీ లాంజ్‌లో ఉండగా.. వెయిటర్..సెల్ఫీ తీసుకుంటానని అంటూ వైఎస్ జగన్ వద్దకు వచ్చారు. అతను వస్తూనే.. వైఎస్ జగన్‌పై కోళ్ల పందెలకు ఉపయోగించే కత్తితో దాడి చేశాడు. ఈ సమయంలో అప్రమత్తంగా ఉన్న వైఎస్ జగన్ సహాయకులు దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ భుజానికి కత్తి తగలడంతో గాయమైంది. చిన్న గాయం కావడంతో వెంటనే జగన్ విమానం ఎక్కి వెళ్లిపోయారు. హైదరాబాద్ చేరుకున్న తరవాత సిటీ న్యూరో ఆస్పత్రిలో చేరారు. ఆ ఆస్పత్రి వైద్యులు తొమ్మిది కుట్లేసినట్లుగా ప్రకటించారు. మూడు వారాల వరకూ రెస్ట్ తీసుకున్నారు. ఇది పెద్ద సంచలనం అయింది. ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న దర్యాప్తు మీద తమకు అనుమానాలు ఉన్నాయని హైకోర్టులో వైసీపీ నేతలు పిటిషన్ వేయడంతో కేసును కోర్టు ఎన్ఐఏకు ఇచ్చింది. విచారణ జరిపిన ఎన్ఐఏ 2019 లోనే చార్జిషీటు దాఖలుచేసింది. ఈ దాడి కేసులో మొదటి ముద్దాయిగా జనిపల్లి శ్రీనివాస రావును పేర్కొన్నారు. చార్జిషీటుతో పాటు నిందితుడు శ్రీనివాసరావు విశాఖ జైల్‌లో రాసుకున్న 22పేజీల లేఖను కూడా కోర్టుకు అందజేశారు. ఈ కేసును రహస్యంగా విచారించాలని విచారణకు సంబంధించిన వివరాలు మీడియాకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించ కూడదని.. మీడియా కూడా విచారణకు సంబంధించిన వివరాలు ప్రచురించ కూడదని అప్పట్లో ఎన్ఐఏ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# కోల్ కత్తాలో అండర్ వాటర్ మెట్రో

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు గురి కావడం వల్ల కొద్ది రోజుల పాటు పనులు నిలిపివేశారు. ఎప్లలాండే నుంచి హౌరా మైదాన్ వరకూ దాదాపు 4.8 కిలోమీటర్ల మేర ఈ మెట్రో ట్రైన్‌ల టెస్ట్ రన్ చేసేందుకు ప్లాన్ చేశారు అధికారులు. తొలిసారి 1984లో మెట్రో కోల్‌కత్తాలోని ప్రారంభమైంది. అండర్ వాటర్ ప్రాజెక్ట్ కూడా ఇక్కడే మొదలవుతుండటం ఆసక్తికరంగా మారింది. సెక్టార్ ఎ నుంచి సీల్దా మధ్య సెక్షన్ ఇప్పటికే ఆపరేషన్‌కు రెడీగా ఉంది. అయితే సీల్దా నుంచి ఎప్లలాండే మార్గంలో పనులు ఇంకా పూర్తి కాలేదు. 2019 నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. కానీ ట్రయల్ రన్ నేపథ్యంలో ప్రస్తుతం టెంపరరీ ట్రాక్స్ వేస్తున్నట్టు మెట్రో అధికారులు వెల్లడించారు. ప్రజలకు ఎప్పుడు ఇవి అందుబాటులోకి వస్తాయన్నది ఇంకా అధికారికంగా చెప్పలేదు. ట్రయల్ రన్ సక్సెస్ అయిన తరవాత పరిస్థితులను బట్టి ఆ తేదీలు ప్రకటించే అవకాశముంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. విదేశాల్లో ఇలాంటి అండర్ వాటర్ ప్రాజెక్ట్ ఉంది. లండన్, పారిస్‌ను కలుపుతూ ఈ ట్రైన్ అందుబాటులో ఉంది. ఈ అండర్ వాటర్ మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కి రూ.157 కోట్ల ఖర్చైనట్టు అధికారులు స్పష్టం చేశారు

# రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయ్

## బీజేపీ ఎంపీ సోయం బాపురావు షాకింగ్ కామెంట్స్

**అల్లూరి సీతారామరాజు**

ఆంధ్రప్రదేశ్లో ఏంటీ.. రహదారులు ఇంత అధ్వానంగా ఉన్నాయి. 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు.. మూడున్నర గంటలు పట్టింది. మా రాష్ట్రం వెనుకబడింది అనుకున్నాను. కానీ.. తీరా చూస్తే ఇక్కడ మరీ అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి" అంటూ ఆంధ్రప్రదేశ్ రహదారులపై ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయని.. పాడేరు వాసులను తలచుకుంటుంటే జాలేస్తోందంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జనజాతి సురక్ష మంచ్ నిర్వహించిన ర్యాలీకి ఎంపీ సోయం బాపురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపురావు మీడియాతో మాట్లాడుతూ.. 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు మూడున్నర గంటల సమయం పట్టిందంటూ పేర్కొన్నారు. మా రాష్ట్రం తెలంగాణ వెనకబడి ఉందని అనుకున్నానని కానీ, ఇక్కడి పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయంటూ తెలిపారు. ఏపీ రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయని.. పాడేరు వాసులు విశాఖపట్టణం ఎలా వెళ్తున్నారో అర్థం కావడం లేదంటూ పేర్కొన్నారు.రాష్ట్ర విభజన తర్వాత కూడా జిల్లా కేంద్రాలు అభివృద్ధి చెందకపోవడం దారుణమంటూ సోయం పేర్కొన్నారు. కొన్ని కొండ గ్రామాల్లో ఇంకా చదువుకోని వారు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతోందని.. ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటూ సోయం బాపురావు కోరారు.

# బీఆర్ఎస్ నుంచి పొంగులేటీ, జూపల్లి సస్పెండ్

(మొదటిపేజీ తరువాయి)

నేతలు ఒకేవేదికపై కనిపించడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. చాలా కాలం తర్వాత ఇద్దరు ఒకే వేదికపై కనిపించడమే కాదు... బీఆర్ఎస్, కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు కూడా ఎక్కుపెట్టారు.ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఇలాంటి చెత్త పాలన దేశానికి అందివ్వాలనే జాతీయ పార్టీ పేరుతో కేసీఆర్ బయల్దేరారని ఆరోపించారు ఇరువురు నేతలు. కుటుంబ స్వార్థానికి రాష్ట్రాన్ని బలి చేశారని... ఇప్పుడు దేశాన్ని కూడా బలి చేసేందుకు సిద్ధమయ్యారంటూ తీవ్ర విమర్శలు చేశారు. హ్యాట్రిక్ విజయం చేయాలని అనుకుంటున్నారని అయితే ఇది సాధ్యమయ్యే పని కాదన్నారు. పార్టీకి రాజీనామా చేయకుండా కొన్ని నేలల నుంచి ఆత్మీయ సమ్మేళనాల పేరుతో పొంగులేటి పొలిటికల్ హీట్ పుట్టిస్తున్నారు. ఇన్నాళ్లు ఒక్కరే ఈ సమావేశాలు నిర్విహిస్తూ వచ్చారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో అసంతృప్తులను పిలవడం మొదలు పెట్టారు. మొదట జూపల్లి కృష్ణారావును పిలించారు. ఇకపై మరింత మందిని పిలిచే ఛాన్స్ ఉందని గ్రహించిన బీఆర్ఎస్ అధినాయకత్వం చర్యలకు ఉపక్రమించింది. పార్టీపైన, కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసిన జూపల్లి కృష్ణారావు, పొంగులేటిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసినట్టు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అందుకే చర్యలు తీసుకున్నట్టు పేర్కొంది. కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్దన్‌తో జూపల్లికి పడటం లేదు. ఇద్దరి మధ్య ఎప్పటి నుంచో విబేధాలు ఉన్నాయి. 2018లో బీఆర్ఎస్ తరఫున జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నుంచి హర్షవర్దన్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గెలిచిన హర్షవర్దన్ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి వీరి మధ్య సఖ్యత లేదన్నది పార్టీలో అందరికీ తెలుసు. బహిరంగంగానే ఇద్దరూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. హర్షవర్దన్, జూపల్లి మధ్య ఉన్న పొరపొచ్చాలు తగ్గించేందుకు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ సెట్ కాలేదు. కాలక్రమంలో అన్నీ సర్దుకుంటాయని పార్టీ భావించినప్పటికీ అలాంటి సూచనలు కనిపించలేదు. కానీ పార్టీలో జూపల్లి ఇన్‌యాక్టివ్ అయ్యారు. కార్యక్రమాలకు దూరంగా జరుగుతూ వచ్చారు. ఇంతలో మొన్నీ మధ్య సిట్టింగ్‌లకే టికెట్లు ఉంటాయని ఓ రివ్యూలో కేసీఆర్ చెప్పడంతో పార్టీపై జూపల్లి అసంతృప్తి మరింత పెంచుకున్నారు.కొన్ని రోజుల క్రితం పార్టీ మారుతారన్న ఊహాగానాలు ఈ ఇద్దరి నాయకులపై వచ్చాయి. పొంగులేటి అయితే కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినాయకత్వాలతో టచ్‌లో ఉన్నారు. అసలు ఆయన ఏ పార్టీలో చేరుతారన్న ఉత్కంఠ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఈ మూడు ఆప్షన్స్ లో ఒక ఆప్షన్ నిన్న తీసేస్తూ మాట్లాడారు. తాను మాత్రం జాతీయ పార్టీలో చేరతాను అని చెప్పుకొచ్చారు. జాతీయ పార్టీలోనే చారుతాన్న పొంగులేటి కామెంట్స్ ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచాయి. అసలు ఆ పార్టీ ఏది కాంగ్రెస్ పార్టీనా లేకుంటే బీజేపీనా అనే చర్చ మొదలైంది. గతంలో ఓసారి ఇదిగో బీజేపీలో చేరిపోతున్నారు.. అదిగో కాంగ్రెస్‌లో చేరిపోతున్నారనే చర్చ నడిచింది. అధినాయకత్వం అపాయింట్‌మెంట్ కూడా తీసుకున్నారనే పుకార్లు కూడా వైరల్ అయ్యాయి. కానీ ఇంత వరకు ఏ పార్టీలో చేరుతున్నారో ఆయన చెప్పలేదు.జూపల్లి కృష్ణారావు స్వతహాగా కాంగ్రెస్ లీడర్. రాష్ట్రవిభజన టైంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన కాంగ్రెస్ నుంచి రావడానికి అప్పట్లో ఆ పార్టీలో ఉన్న డీకే అరుణ కూడా కారణమయ్యారు. ఆమెతో ఉన్న విభేదాలు కారణంగా ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఇప్పుడు ఆయనకు ఉన్న ఆప్షన్లు కాంగ్రెస్, బీజేపీ. అయితే డీకే అరుణ బీజేపీలో ఉన్నందున ఆ పార్టీలో చేరుతారా లేదా అన్నది ఇక్కడ అనుమానించదగ్గ విషయం. తర్వాత తన సొంత ఇంటి లాంటి కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న చర్చ మొదలైంది

# స్టీల్ ప్లాంట్ కు తెలంగాణ సర్కార్ బిడ్డింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఏపీలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తుంది బీఆర్ఎస్. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేయనుంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ధర్నాచేస్తున్న కార్మికులకు మద్దతు తెలపనుంది. ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ ఇవాళ కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొంటున్నారు బీఆర్ఎస్ స్ట్రాటెజీ ఏపీ పొలిటికల్ వర్గాల్లో సైతం చర్చనీయాంశంగా మారింది. అయితే, మున్ముందు ప్రణాళిక, కార్యచరణ ఎలా ఉండబోతోంది అనేది ఆసక్తి కరంగా మారింది.

# రేపు మహిళల అకౌంట్లలోకి 15 వేలు

**విజయవాడ :**

అగ్రవర్ణ మహిళలకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రారంభించింది. ఆర్థికంగా వెనుకబడిన వారిలో 45-60 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ఈ పథకం ద్వారా ఏటా రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తోంది. ఈ ఏడాది నిధుల విడుదల సంబంధించిన కార్యక్రమాన్ని సీఎం జగన్.. ఈనెల 12వ తేదీన ప్రకాశం జిల్లా మార్కాపురంలో ప్రారంభించనున్నారు. బటన్ నొక్కి నేరుగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఈ పథకం కింద ఒక్కో మహిళకు ఏటా రూ.15 వేల చొప్పున మూడేళ్లపాటు అందిస్తారు. రాష్ట్రంలోని రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన 3.93 లక్షల మంది మహిళలకు ఆర్థిక సాయం అందనుంది. రూ.589 కోట్ల ఆర్థిక సాయాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి వీరి ఖాతాల్లో వేయనున్నారు. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకంలో 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతోపాటు ఓసీ వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఏటా రూ. 15 వేలు మూడేళ్లలో మొత్తం రూ. 45,000 ఆర్థిక సాయం అందిస్తుంది ప్రభుత్వం. ఇప్పటికే వైఎస్ఆర్ చేయూత పథకం కింద 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద మహిళలకు ఏటా రూ. 18,750 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అలాగే వైఎస్ఆర్ కాపునేస్తం ద్వారా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల్లోని మహిళలకు ఏటా రూ. 15 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. మేనిఫెస్టోలో పెట్టకపోయినా అగ్రవర్ణ పేద మహిళలకు వైఎస్ఆర్ ఈజీసీ నేస్తం పథకం ద్వారా ఏటా రూ. 15 వేలు అందివ్వడంతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల వయసు గల పేద మహిళలకు లబ్ది చేకూరుతుందని ప్రభుత్వం తెలిపింది. మహిళల ఆర్థిక సాధికారతతో పాటు సంక్షేమం, ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అందులో భాగంగా గర్భవతులు, బాలింతలు, చిన్నారుల కోసం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించింది. మహిళ ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. మహిళల భద్రత కోసం అభయం, దిశ యాప్, గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా కానిస్టేబుళ్ల నియామకం చేపట్టినట్లు వెల్లడించింది. మహిళలకు సాధికారతే లక్ష్యంగా ఇళ్ల పట్టాలు వాళ్ల పేరు మీద ఇస్తున్నట్లు పేర్కొంది.

# కళ్యాణిని విడిచిపెట్టాలి

**విశాఖపట్నం**

జగన్మోహన్ రెడ్డి పైశాచికపాలనకు, సైకోయిజానికి పరాకాష్ట మూల్పూరి కల్యాణి అరెస్టని టీడీపీ మహిళా విభాగం నేత వంగలపూడి అనిత అన్నారు. ఫిబ్రవరి 20 గన్నవరం టీడీపీకార్యాలయంపై వైసీపీగూండాలు దాడిచేసిన ఘటనలో రెండుకేసుల్లో పోలీసులు కల్యాణిని నిందితురాలిగా చేర్చారు. ఆ ఘటన జరిగిననాడు పోలీసులు, ఆమెను భయభ్రాంతులకు గురిచేశారు. జగన్మోహన్ రెడ్డి వైఫల్యాలు, అతనిప్రభుత్వ అవినీతి, దుర్మార్గాలను ఎత్తిచూపుతున్నందుకే కల్యాణిపై పోలీసులు, వైసీపీ కక్షకట్టింది. కల్యాణిని నేడు అరెస్ట్ చేసినవిధానం సభ్యసమాజానికే తలవంపులని ఆమె ఆరోపించారు.

బాబాయ్ ని చంపినవారిని పక్కనపెట్టుకొని ముఖ్యమంత్రి ఢిల్లీపర్యటనలు చేస్తుంటే, ప్రతిపక్షానికి చెందిన మహిళానేతల్ని మాత్రం దేశద్రోహుల్లా పోలీసులు చూడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కల్యాణిని వెంటనే విడుదలచేయాలని తెలుగుమహిళ విభాగంతరుపున ముఖ్యమంత్రిని పోలీస్ విభాగాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# వరుస భేటీలతో కిరణ్ రెడ్డి

**న్యూఢిల్లీ :**

భారతీయ జనతా పార్టీలో చేరిన ఏపీ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్రెడ్డి వరుసగా ఆ పార్టీ సీనియర్ నేతలను కలుస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సమక్షంలో పార్టీలో చేరిన బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు. తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. దాదాపుగా 40 నిమిషాల పాటు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాజకీయాలపైనాచర్చించారు. మరో సీనియర్ నేత బీఎల్ సంతోష్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి అనుభవాన్ని ముందుగా కర్ణాటక ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని బీజేపీ హైకమాండ్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. కర్ణాటకలో తెలుగు ఓటర్ల ప్రభావం కాస్త ఎక్కువగానే ఉంటుంది. కనీసం ఇరవై నియోజకవర్గాల్లో తెలుగు ఓటర్లు గెలుపోటముల్ని ప్రభావితం చేయగలరు. అందుకే కిరణ్ కుమార్ రెడ్డికి ముందుగా కర్ణాటక ఎన్నికల్లో ఓ ప్రత్యేకమైన బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కర్ణాటకలో ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. అభ్యర్థుల్ని ఖరారు చేస్తున్నాయి రాజకీయ పార్టీలు. ఈ క్రమంలో ఆయన నేరుగా ఎన్నికల్లో జోక్యం చేసుకునే అవకాశం ఉండదు కానీ.. ఆయన ఆలోచనలను ఎన్నికల్లో వాడుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో వైపు ఇప్పటికిప్పుడు ఏపీ రాజకీయాల్లోకి కిరణ్ కుమార్ రెడ్డిని పంపకపోచ్చని.. ఆయనను పార్టీలో చేర్చుకున్న వ్యూహం జాతీయ రాజకీయాలని చెబుతున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీ నాయకత్వం ఆయనకో పదవి ఇస్తుందని.. జాతీయంగా పార్టీ కోసం పని చేస్తారని.. రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా జోక్యం చేసుకోకపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా పని చేసినందున తెలంగాణలో రాజకీయాలపైనా ఆయనకు అవగాహన ఉంటుంది. సమైక్యాంధ్ర పార్టీ పెట్టినందన ఆయన జోక్యం నేరుగా తెలంగాణలో ఉండకపోవచ్చు కానీ.. ఢిల్లీలో ఉంటూ తెలంగాణ పై రాజకీయ వ్యూహాలను అమలు చేయడంలో కిరణ్ రెడ్డి వ్యూహాత్మకంగా పని చేయవచ్చునని అంచనా వేస్తున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి చేరిక కోసం ఢిల్లీ వెళ్లిన వారిలో ఎక్కువ మంది ఏపీ బీజేపీ నేతలు లేరు. సోము వీర్రాజు సహా కీలక నేతలంతా ఏపీలోనే ఉన్నారు. అయితే వారెవరూ కిరణ్ రెడ్డి చేరికపై వ్యతిరేకత వ్యక్తం చేయడంలేదు. అందరూ స్వాగతించారు. కలిసి పని చేస్తామన్నారు. అలాంటప్పుడు.. బీజేపీ నేతలంతా కిరణ్ రెడ్డి చేరిక కార్యక్రమలో పాల్గొని ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కానీ బీజేపీ నేతలు మాత్రం.. కిరణ్ కుమార్ రెడ్డిని జాతీయ రాజకీయాల కోణంలోనే హైకమాండ్ చేర్చుకుందని అందుకే చేరిక విషయంలో రాష్ట్ర నేతలతో పెద్దగా సంప్రదింపులు జరపలేదని.. సమాచారం కూడా ఇవ్వలేదని చెబుతున్నారు.

# కర్నూలులో వింత ఆచారం

## తన్నుల కోసం క్యూ

**కర్నూలు :**

భక్తి అనేది ఓ నమ్మకం. దేవుడి నుంచి మోక్షం పొందేందుకు భక్తులు రకరకాల పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. అయితే.. ఇక్కడ మాత్రం పూజారి కాలితో తంతే మోక్షం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. ఆయన కాలి తన్నుల కోసం భక్తులు బారులు తీరుతుంటారు. పూజరితో తన్నించుకోవడం కోసం చిన్నా, పెద్దా, ఉన్నోడు, లేనోడు అనే తేడా లేకుండా అందరూ పోటీ పడతుంటారు. కాలితో తన్నించుకొన్న వారు మోక్షం పొందినట్టుగా భావిస్తుంటారు. అయితే.. ఈ తన్నుడు కథ గురించి తెలుసుకోవాలంటే.. ఏపీలోని కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి మండలం చిన్నహోతురు గ్రామానికి వెళ్లాల్సిందే. గ్రామంలోని శ్రీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. అయితే.. ఈ ఆలయంలో ఏటా ఏప్రిల్ నెలలో రథోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున శివపార్వతులకు ఆలయంలో వైభవంగా కల్యాణం జరిపిస్తారు.ఆ కళ్యాణోత్సవం ముగిసిన తర్వాత.. భక్తులు ఆలయం ముందు వరస క్రమంలో భక్తులు బారులు తీరుతారు. అప్పుడు ఆలయ పూజారి.. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను నెత్తి మీద పెట్టుకొని ఒక చేతితో త్రిషులం పట్టుకొని.. నాట్యం చేస్తూ గుడి నుంచి బయటికి పరుగెత్తుకుంటూ వస్తారు. వరుస క్రమంలో ఉన్న కొందరి భక్తులను నాట్యం చేస్తూనే కాలితో తన్నుకుంటూ వెళ్తారు. పూజారి కాలితో తన్నిన భక్తులు స్వామివార్లకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి వెళ్లిపోతారు. ఇలా తన్నటం వల్ల తమకు మోక్షం జరుగుతుందనే అభిప్రాయాన్ని భక్తులు వ్యక్తం చేస్తున్నారు.మహా యోగి శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి శివుడు భక్తుడు. ఆయన 500 వందల సంవత్సరాలకు ముందే ఒక ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. ఆ ఆలయంలో స్వామివార్ల విగ్రహాలతో పాటు ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేసుకొన్నట్లు చెబుతున్నారు. ప్రతి ఏటా కర్ణాటకలోని హంపి వీరుపాక్షి స్వామి రథోత్సవ ఉత్సవాలు ఎలా జరుగుతాయో.. అచ్చం అదే విధంగా చిన్నహోతురులో కూడా మహా యోగి శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి కూడా నిర్వహించే వాడని పూర్వికులు చెబుతున్నారు. అయితే.. ఉత్సవాల చివరి రోజున శివ పార్వతులకు సిద్ధ రామేశ్వర స్వామి కళాణ్యం జరిపించేవారని.. ఆ కళ్యాణంలో స్వామివారి భక్తులు కొన్ని తప్పులు చేయటంతో.. ఆయన కుమారుడు వీరభద్ర స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారట.వీరభద్ర స్వామి ఆలయ పూజారి రూపంలో.. గుడిలో ఉన్న త్రిశూలాన్ని తీసుకొని తల్లిదండ్రుల ఉత్సవ విగ్రహాలను తల మీద ఉంచుకొని ఆగ్రహంతో నాట్యం చేస్తూ భక్తులను తన కాలితో తన్నినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. అలా స్వామి వారి కాలి తన్నులు తిన్న వారికి మోక్షం జరిగిందని భక్తులు అంటున్నారు. దాదాపు 500 ఏళ్లకు ముందు నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని.. తాము ఇప్పటికీ కొనసాగిస్తున్నామని చెబుతున్నారు. పూజారి తన్నుల సేవా కార్యక్రమం ముగిసిన తరువాత స్వామి వార్లకు భక్తులు వసంతోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని గులాబీ రంగు ఉన్న నీటితో జరిపిస్తారు. స్వామివార్ల వసంతోత్సవం ముగిసిన వెంటనే గ్రామస్తులు ప్రత్యేకంగా గ్రామంలో ఏర్పాటు చేసుకొన్న పెద్ద గుంతలలో గులాబీ రంగు నీళ్లు కలుపుకొని వారు కూడా ఆ గులాబీ రంగు నీళ్లతో వసంతోత్సవం జరుపుకొంటారు ఇది సంప్రదాయం అని గ్రామస్థులు చెబుతున్నారు.

# కాణిపాకంలో ఇంటి దొంగలు

**తిరుపతి:**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం వరసిద్ధి వినాయకుని దేవస్థానంలో దొంగలు పడ్డారు. భక్తుల కోసం సిద్ధం చేసే అన్నప్రసాదం సామాగ్రి దొంగతనానికి గురికావడం అందరినీగ్భ్రాంతికి గురిచేసింది. ఇందులో ఇద్దరు వంట సిబ్బంది, మరో ఇద్దరు సహాయకుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత కొంత కాలంగా నిత్య అన్నదానానికి ఉపయోగిస్తున్న సామాగ్రి చోరీకి గురవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆలయ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టడంతో నిర్ధారణ అయింది.దీంతో ఆలయ ఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటి దొంగల గుట్టును రట్టు చేశారు. ఈ తనిఖీల్లో 25 బస్తాల బియ్యం, 2 బస్తాల కందిపప్పు, 10 డబ్బాల వంట నూనె, మిరపకాయలు తదితర వంట వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈవో తనిఖీల్లో రెండు జింక చర్మాలు కూడా లభ్యం కావడం కలకలం రేపుతోంది. పవిత్రమైన పుణ్యక్షేత్రంలో పనిచేస్తూ ఇలాంటి పనులు చేయడమేంటని వంట సిబ్బందిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలోనూ కాణిపాకం ఆలయంలో చోరీ జరిగింది. కాణిపాక ఆలయం పునః నిర్మాణం పూర్తయ్యాక ఆలయ కుంభాభిషేకం రోజున స్వామి విగ్రహాన్ని అలంకరించేందుకు బంగారు విభూతి పట్టీని ఓ భక్తురాలు విరాళంగా ఇచ్చారు. వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు చెందిన నారాయణి శక్తి అమ్మణ్ ఈ బంగారు విభూదిపట్టీని స్వామివారికి కానుకగా ఇచ్చారు. విభూదిపట్టీ విలువ రూ. 18 లక్షలు. ఈ విభూది పట్టీని స్వామివారి కుంభాభిషేకం సందర్భంగా గతేడాది ఆగస్టు 21 వ తేదీన స్వామివారికి అలంకరించారు. ఆ తర్వాత రోజు నుంచి అది కనిపించడం లేదు. విరాళమిచ్చిన భక్తురాలు తనకు రశీదు ఇవ్వలేదని అధికారులను సంప్రదించడంతో పట్టీ కనిపించడం లేదన్న విషయం బయట పడింది.విభూదిపట్టీ మాయంపై భక్తురాలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. విషయం దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి రావడంతో దీనిపై విచారణ జరిపిస్తామని చెప్పుకొచ్చారు. దీంతో ఆ ఆభరణం గురించి ఆరా తీయడం ప్రారంభించారు. ఈ క్రమంలో 45 రోజుల తర్వాత ఆలయ యాగశాలలో విభూదిపట్టీ ప్రత్యక్షమైంది. అయితే ఇన్ని రోజులు స్వామివారి వెండి విభూతి పట్టీ ఎక్కడుంది ? దాన్ని ఎవరు దొంగిలించారు ? యాగశాలకు ఎలా చేరింది ? అనే అంశంపై విచారణ జరిపారు. అయినా దొంగలేవరో తేలలేదు. ఈ క్రమంలో మరోసారి ఇంటి దొంగలు చేతివాటం ప్రదర్శించటం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై అధికారులు విచారణ జరిపిస్తున్నట్లు తెలిసింది.

# మరో పోరాటానికి కోటంరెడ్డి

**నెల్లూరు :**

వదలా బొమ్మాళీ నిన్నొదలా...అన్నట్లు వైసీపీ ప్రభుత్వాన్ని వదిలేదే లేదు అంటున్నారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారంటూ వైసీపీ అధిష్టానం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా చేయనంతగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పటికే జలదీక్ష పేరుతో వైసీపీ నాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి పెట్టిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరో పోరాటానికి శ్రీకారం చుడుతున్నారు. బారాషాహీద్ దర్గాకు రూ.15కోట్లు మంజూరు చేసి నేటికీ నిధులు విడుదల చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మత పెద్దలు, మౌజాంలు మైనార్టీలను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. పోస్ట్ కార్డులు, వాట్సప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా పోరాటం చేయాలని అందుకు అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇప్పుడు ఈ పేరు ఆంధ్రప్రదేశ్‌లో తెలియని వారు ఉండరు. ఒకప్పుడు నెల్లూరు రూరల్ నియోజకవర్గానికే పరిమితమైన ఆయనను ఇప్పుడు ఏకంగా రాష్ట్ర నాయకుడిని చేసేసింది వైసీపీ. వైసీపీ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని ఆరోపిస్తూ ఒక్కసారిగా వార్తల్లోకెక్కిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అప్పటి నుంచి నిత్యం వార్తల్లోనే నిలుస్తున్నారు. వైసీపీలోనే ఉంటూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో స్వపక్షంలో విపక్షంగా తయారయ్యారు. అసెంబ్లీలో ప్రతిపక్షంగా మారి ప్రభుత్వానికి ఏకుమేకై కూర్చున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగడంతో ఆ సెషన్ అంతా సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించి మరోసారి వార్తల్లో నిలిచారు. అనంతరం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటేశారంటూ వైసీపీ ఆరోపించింది. ఈ మేరకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితోపాటు నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఎప్పుడైతే సస్పెండ్ చేసిందో అప్పటి నుంచి వైసీపీపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల మధ్యలోకి వెళ్తున్నారు.ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరో పోరాటానికి సిద్ధమయ్యారు. భారతదేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన బారాషాహిద్ దర్గా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసి ఇప్పటికి 9 నెలలైనా నిధులను మాత్రం మంజూరు చేయకపోవడంతో ఆయన పోరాట పంథాను ఎంచుకున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన సంతకానికే విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ నెల్లూరు జిల్లాలోని ప్రతి మసీదుకు వెళ్లి మత పెద్దలు మౌజాంలు, ఇతర మైనార్టీ నేతలతో ఆయన సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. బారాషాహీద్ దర్గాకు మంజూరైన నిధులు, వాస్తవ పరిస్థితి ఇంతవరకు ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకపోవడం వల్ల విడుదల చేయలేదని, వారికి వివరించి వారి మద్దతును కూడగట్టే ప్రయత్నాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేస్తున్నారునెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలోని అన్ని మసీదుల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి పోస్ట్ కార్డులు, ఎస్ఎంఎస్‌లు వాట్సాప్ రూపంలో నిరసన తెలియజేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మైనార్టీలను పెద్ద ఎత్తున కూడగట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇకపోతే నెల్లూరు జిల్లాలో బారాషాహిద్ దర్గాతో ప్రతి ఒక్కరికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఇంతటి ప్రతిష్టాత్మకమైన దర్గాకు నిధులు విడుదల చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాన్ని తెలియజేయడమే లక్ష్యంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అడుగులు పడుతున్నాయి. ఈ పోరాటంతో నైనా ముఖ్యమంత్రి సంతకానికి విలువనిస్తూ బారాషాహిద్ దర్గాకు నిధులు మంజూరవుతాయని మైనార్టీలు ఆశతో ఎదురుచూస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ కోటంరెడ్డి అడుగులు మాత్రం వైసీపీకి పెద్ద సవాల్‌గా మారుతోంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.నెల్లూరు రూరల్ పరిధిలో పొట్టేపాల్లెం కలుజు రిపేర్లు కోసం నిరసన తెలుపుతూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇటీవలే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జలదీక్షకు పిలుపునిచ్చారు. దీక్ష చేపట్టేందుకు సిద్ధమవుతుండగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.అంతేకాదు దీక్ష చేపట్టేందుకు చేస్తున్న ఏర్పాట్లను సైతం పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. జలదీక్ష జరగకుండా పోలీసులు అడ్డుకుంటే అడ్డుకున్నారు కానీ వ్యూహాత్మకంగా అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టడంలో మాత్రం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సక్సెస్ అయ్యారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. టీడీపీ, జనసేన, కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ లీగ్, వామపక్షాలనేతలు తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. అన్ని రాజకీయ పక్షాల నేతల అడుగులు నెల్లూరులో ఉన్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నివాసం వైపు పడటం అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడలేదన్న విషయం తెలిసిందే.

# గెహ్లాట్ వర్సెస్ పైలెట్

**జైపూర్ :**

రాజస్థాన్‌లో మరోసారి పైలట్ వర్సెస్ గహ్లోట్ ఫైట్ మొదలైంది. సీఎం కుర్చీలో కూర్చోవాలని కలలు కంటున్న సచిన్ పైలట్...గహ్లోట్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు మొదలవడం అధిష్ఠానాన్ని టెన్షన్ పెడుతోంది. ఎలాగైనా గహ్లోట్‌ను గద్దె దింపి...సీఎం పదవిని హస్తగతం చేసుకోవాలని చూస్తున్న పైలట్...ఒక్క రోజు నిరాహార దీక్ష చేస్తానంటూ ప్రకటించారు. గతంలో వసుంధర రాజే ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఇంత వరకూ గహ్లోట్ స్పందించలేదని, అందుకే నిరాహార దీక్షకు దిగుతున్నాటని స్పష్టం చేశారు పైలట్. “ఏప్రిల్ 11వ తేదీన ఒక రోజు పాటు నిరాహార దీక్ష చేస్తాను. రాష్ట్రంలో అవినీతిపరులపై ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. ఇలా అయితేనే ప్రజలకు మాపై నమ్మకముంటుంది. కేవలం పని చేస్తున్నామని కాకుండా వాళ్ల హామీలు నెరవేరుస్తున్నామన్న భరోసా వస్తుంది” గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వీటిపై సీబీఐ విచారణ కూడా జరిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అవినీతిపై మా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేపై మైనింగ్ స్కామ్ ఆరోపణలు వచ్చాయి. అయినా దీనిపై అఃఎ విచారణ జరపడం లేదు. లలిత్ మోదీపైనా ఎలాంటి చర్యలు లేవు. ఇలా అయితే ప్రజలకు తప్పుడు సందేశం ఇచ్చిన వాళ్లమవుతాం. మా ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు ఎన్నో హామీలిచ్చాం. అవినీతిని అడ్డుకుంటామని భరోసా కల్పించాం. కానీ ఇప్పుడది జరగడం లేదు. దీనిపై నిరసనగానే నేను నిరాహార దీక్ష చేస్తాను. ఇప్పటి వరకూ ప్రభుత్వం చేయని పనులన్నీ చేయాలన్నదే నా లక్ష్యం” సచిన్ పైలట్, గహ్లోట్ మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై గహ్లోట్‌ను ప్రశ్నించగా..”అదేం లేదు. మేమిద్దరం వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం” అని బదులిచ్చారు. పార్టీ అన్నాక నేతల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉంటాయని అన్నారు. ఏదేమైనా ఈ విభేదాలు మాత్రం అధిష్ఠానానికి తలనొప్పి తెచ్చి పెడుతోంది. పార్టీ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎన్నికైన వెంటనే రాజస్థాన్ రాజకీయాల్లో మార్పులు వస్తాయని భావించారంతా. కానీ...అక్కడ పరిస్థితులు ఏమీ చక్కబడ లేదు. ఆ మధ్య ఓ సారి వీళ్లిద్దరినీ కలిపే ప్రయత్నం చేసినా పెద్దగా వర్కౌట్ కాలేదని తెలుస్తోంది. పైగా...అధిష్ఠానం కూడా గహ్లోట్‌నే సపోర్ట్ చేస్తున్నట్టు సమాచారం

# పెంచిన విద్యుత్ చార్జీలపై భూమా ఆద్వర్యంలో నిరసన

**నంద్యాల**

రూపాయి ఇచ్చి 100రూపాయలు నొక్కే స్తున్న జగన్ రెడ్డి ప్రభుత్వానికి సమాధి కట్టే రోజు వచ్చింది. .భూమారాష్ట్రంలో వరుసగా ఎడవసారి పెంచిన విద్యుత్తు చార్జీలను నిరసిస్తూ తెలుగు దేశం పార్టీ అధిష్టానం ఆదేశాలమేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా నంద్యాల పట్టణంలోని విశ్వ నగర్ సబ్ స్టేషన్ వద్ద తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భూమా బ్రహ్మానందరెడ్డి యువనేత ఫిరోజ్ ఆద్వర్యంలో తెలుగు తమ్ముళ్లు భారీ ధర్నా నిర్వహించారుఈ సందర్భంగా మాజీ ఎం ఎల్ ఏ భూమా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచింది పేదోడి నడ్డి విరిచింది అన్నారు.. విద్యుత్ చార్జీల పెరుగు దలతో పరోక్షంగా అనేరకాలుగా ధరలు పెరిగి సామాన్యుడి బ్రతుకు దుర్భరం అయిందన్నారు..సంక్షేమం పేరుతో ఒక్క రూపాయి ఇస్తూ 100రూపాయలు ప్రజల జేబులకు జగన్ రెడ్డి ప్రభుత్వం చిల్లు పెడుతోంది అన్నారు..సంక్షేమ పదకాలు కొంతమందికి ఇచ్చి 80శాతం ప్రజలను రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం నిట్టనిలువుగా ముంచేసి ఇప్పుడు జోలె పట్టుకుని ఇంటింటికి స్తిక్కర్లు ఏ ముఖం పెట్టుకొని అంటిస్తారు




అని భూమా దుయ్యబట్టారు..స్థానిక ఎమ్మెల్యే ఆదివారం ఎం ఎల్ ఏ అని సాక్షాతూ వైసిపి కార్యకర్త నామకరణం చేశారని ఈయన ఏదో సందులో చిన్న రోడ్డు వేసి నాడు నేడు అని ఫోటోలు పెట్టడం హాస్యాస్పదం అన్నారు..ఆర్ ఎ ఆర్ ఎస్ భూములు నిర్వీర్యం చేసి మెడికల్ కాలేజ్ పేరుతో ప్రజలను రైతులను మోసం చేశారని భూమా విమర్శించారు.. ప్రజలు అన్నీ గమనించి ఇటీవల చెప్పుతో కొట్టినట్లు ఎం ఎల్ సి పలితాలు ఇచ్చారన్నారు..ఫిరోజ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆకండ విజయం సాధించడం ఖాయం అన్నారు..కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

## టీడీపీ మహిళా నేత కళ్యాణి అరెస్టు

**విజయవాడ**



తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి కల్యాణిని హనుమాన్ జంక్షన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గన్నవరంలో ఫిబ్రవరి 20న తెదేపా, వైకాపా మధ్య జరిగిన గొడవలకు సంబంధించి నమోదైన రెండు కేసుల్లో కల్యాణి నిందితురాలిగా ఉన్నారు. ముందస్తు బెయిల్ రాకపోవడంతో ఆమె అప్పట్నుంచి అజ్ఞాతంలో ఉన్నారు. సోమవారం హనుమాన్ జంక్షన్ లోని తన నివాసంలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు తెల్లవారుజామునే ఇంటిని ముట్టడించి, అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

## లారీ, బొలెరో ఢీ-కారు డ్రైవర్ మృతి

**విజయవాడ**

ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు జాతీయ రహదారిపై వినాయకుడు గుడి దగ్గర లారీని బొలెరో వాహనం ఢీకొంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో కారు ప్రమాదం జరిగింది. తిరువూరు నుండి జి కొండూరు కారులో ఐదుగురు వ్యక్తులు వస్తున్నారు.

ప్రమాదంలో జి కొండూరు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పజ్జురు పద్మనాభరావు (30) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

## అర్టీసీ బస్సు ఢీ..ఇద్దరు యువకులు మృతి

**నిర్మల్**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మహబూబ్ ఘాట్స్ వద్ద ఆదిలాబాద్ నుండి నిర్మల్ వస్తున్న ఆర్టీసీ బస్సు, నిర్మల్ వైపు నుండి ఆదిలాబాద్ వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. , ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా బి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (30), నాందేవ్ (35) అక్కడి కక్కడే మృతి చెందారు. పోలీసులు , మృతదేహాలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

## వడమాల పేట ఫ్లైఓవర్ వద్ద బస్సు బోల్తా

**తిరుపతి**



తిరుపతి జిల్లా వడమాల పేట ఫ్లైఓవర్ వద్ద బస్సు బోల్తా పడింది. సత్యవేడు నుండి తిరుపతి వైపు ఆర్టీసీ బస్సు వెళుతోంది. డ్రైవర్కి బిపి డౌన్ అవ్వడంతో ఒక్కసారిగా పక్కకి ఒరిగి బస్సు బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో పక్కన ఉన్న నీటి కాల్వలో పడకుండా జాగ్రత్త పడ్డాడు. బస్సులో ప్రయాణిస్తున్న ఏడు మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని 108 ద్వారా తిరుపతి హాస్పిటల్ కి తరలించారు. పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు సత్యవేడు డిపో కు చెందింది.

## వీడని తల్లి,బిడ్డ మిస్సింగ్ మిస్టరీ

**విజయవాడ**

ఏడు రోజులు గడిచినా తల్లి,బిడ్డ మిస్సింగ్ మిస్టరీ వీడలేదు. తన భార్య, కుమార్తె ఆచూకీ కోసం ఏడు రోజులుగా భర్త కిషోర్ గాలిస్తున్నాడు. పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదంటూ భాదితుడు ఆరోపిస్తున్నాడు. చిత్తురు జిల్లా పాకాల నుండి ఈ నెల 3న మందుల కోసం భార్య శ్రావణి, కుతూరు సోమ్య రెడ్డి గుంటూరు వచ్చి అదృశ్యం అయ్యారని కిషోర్ అంటున్నాడు. భార్య ఫోన్ స్విఛాఫ్ కావడంతో కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానిస్తున్నాడు. తన తమ ఫిర్యాదును రైల్వే పోలీసులు, జీఆర్పీ, స్దానిక పోలీసులు పట్టించుకోకపోవడంతో సిఎం క్యాంపు ఆఫీస్ వద్ద స్పందన లో ఫిర్యాదు చేసాడు.

## యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**హైదరాబాద్**

యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సివిల్ సప్లై కమిషనర్ అనిల్ కుమార్ లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి తక్షణ చర్యల్లో భాగంగా రేపు ఉదయం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత ఏర్పాట్లు, కార్యాచరణకు చర్యలు చేపట్టాలని సిఎస్ శాంతి కుమారిని సీఎం ఆదేశించారు. గతంలో నిర్వహించిన విధంగానే 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నింటినీ ప్రారంభించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని సీఎం ఆదేశించారు

# ఎదురు తిరుగుతున్న సొంత సామాజిక వర్గం

**కర్నూలు:**

అధికార వైసీపీ మాత్రం రెడ్డి సామాజికవర్గం నేతలతోనే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తుంది. సొంత సామాజికవర్గం కావడంతో జగన్ వారిని దూరంగా పెట్టడం, అన్ని పదవులకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లంటూ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో రెడ్డి సామాజికవర్గంలో అసంతృప్తి నెలకొందనే చెప్పాలి. పదవులు, నామినేటెడ్ పనులు కూడా వారికే దక్కుతుండటంతో డబ్బులు పోగొట్టుకుని, జగన్ ను కష్టపడి గెలిపించినా ప్రయోజనం లేదని ఆ సామాజికవర్గంలో అసంతృప్తి ఎక్కువగా కనపడుతుంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ముగ్గురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం కూడా చర్చనీయాంశమైంది ఇక తాజాగా మరో రెడ్డి గారు తన అసంతృప్తి గళాన్ని విప్పారు. కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌కు అనుభవం లేదన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తేనే ఆయనకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని వ్యాఖ్యానించారు. కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్న మాట వాస్తవమేనని సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. ఇది అసంతృప్తి గళమేనని కొందరు అంటున్నారు. కానీ యధా లాపంగా చేసిన వ్యాఖ్యలను పట్టుకుని రాద్ధాంతం చేస్తున్నారని సాయి ప్రసాద్ రెడ్డి అనుచరులు అంటు న్నారు. నిజానికి సాయిప్రసాద్ రెడ్డి సోదరులు ముగ్గురు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఉన్నారు. ఒకే ఇంటికి చెందిన మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలున్నా తమకు మంత్రి పదవి ఇవ్వలేదన్న అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, గుంతకల్ ఎమ్మెల్యే వెంకట్రామి ఒడ్డిలు ఒక తల్లికి పుట్టిన సోదరులు. ముగ్గురు కూడా రాయల సీమలో ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ వారెవ్వరకీ మంత్రి పదవి ఇవ్వక పోవడంపై అసంతృప్తి ఉందని చెబుతు న్నారు. అందుకే ఆయన అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్త మవుతుంది. మరోవైపు నేరుగా లబ్ది దారుల ఖాతాల్లో జమ చేయడం, వాలం టీర్ల వ్యవస్థ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేయడం వంటివి కూడా ఎమ్మెల్యేలకు మింగుడు పడటం లేదంటు న్నారు. ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా జగన్ మార్చారని కూడా ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అభిప్రాయ పడుతున్నారు. ప్రతి ఆదేశం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వస్తుండటంతో నియోజకవర్గాల్లో పార్టీ నేతలు కూడా ఎమ్మెల్యేలను లెక్కచేయడం లేదని చెబుతున్నారు. అందుకే ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొం దని అంటున్నారు. అందుకే కాస్త బల మున్న రెడ్డి సామాజికవర్గం నుంచే ఈ రకమైన కామెంట్స్ వినపడుతున్నా యంటున్నారు.

# ఏపీ పాలిటిక్స్ పై బీజేపీ డైరక్షన్

**న్యూఢిల్లీ:**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ పొత్తులపై తేల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అలా పార్టీలో చేరగానే ఇలా పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ పార్టీ హైకమాడ్ పెద్దలతో చర్చలు జరిపి వెళ్లిన రెండు రోజుల్లోనే కీలక సమావేశాలు ప్రారంభమయ్యాయి. పొత్తుల విషయంలో ఇప్పటికిప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తీసుకోక పోయినా వచ్చే ఎన్నికల కోసం ఓ రోడ్ మ్యాప్‌ను ఖరారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే హైకమాండ్ ఓ క్లారిటీ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుందని చెబుతున్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజును బీజేపీ హైకమాండ్ ఢిల్లీకి పిలిచింది. పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం కానున్నారు. మూడు రోజుల పాటు ఆయన ఢిల్లీలోనే ఉంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో చేరే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళ్లలేదు. ఇప్పుడు ప్రత్యేకంగా పిలవడంపై మాత్రం బీజేపీలోనే రకరకాల చర్చలు జరుగుతున్నాయి. ఏపీలో కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ పాత్ర ఎలా ఉంటుందన్న దానిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కరిణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసినందున జాతీయ రాజకీయాలకే ఉపయోగించుకుంటారని రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్ర తక్కువ ఉండవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్.. ఢిల్లీ వెళ్లారు. పార్టీ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు.ఏ చర్చలు జరిపారన్నదానిపై స్పష్టత లేదు కానీ..పొత్తుల గురించి కూడా మాట్లాడామని తర్వాత అమరావతిలో మీడియా సమావేశం పెట్టినప్పుడు నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఏపీలో వైసీని ఓడించడమే లక్ష్యమని పవన్ ఢిల్లీలోనే ప్రకటించారు. తాము టీడీపీతో కలిసి వెళ్లడం ఖాయమని ఏపీలో రాజకీయ పరిస్థితులపై అవగాహన ఉందికాబట్టి బీజేపీ కూడా కలసి వస్తే బెటరని జనసేన నుంచి బీజేపీకి సందేశాలు వెళ్లాయని చెబుతున్నారు. అది ఎంత వరకు నిజమో కానీ.. బీజేపీలో ఉన్న కొంత మంది టీడీపీతో పొత్తు కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం అయితే జోరుగా సాగుతోంది. సోము వీర్రాజు పర్యటనలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ వ్యూహం ఏమిటో అన్నది క్లారిటీకి వచ్చే అవకాశంఉంది. జనసేనకు క్లారిటీ ఇస్తే.. ఆ పార్టీ తన రాజకీయ వ్యూహాలను తాను అమలు చేసుకునే ?వకాశం ఉంది. ఒంటరిగా పోటీ చేస్తే బీజేపీకి నిరాశే ఎదురవుతుంది. అందులో ఎలాంటి డౌట్ లేదు. ఢిల్లీ స్థాయిలో మంచి సంబంధాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ నేరుగా బీజేపీతో పొత్తులు పెట్టుకోలేదు. అది అసలు సాధ్యం కాదన్న వాదన ఉంది. రెండు వైపులా పార్టీలకు అభ్యంతరాలు ఉంటాయి. జగన్ పై ఉన్న కేసుల కారణంగా బీజేపీ పొత్తులకు సిద్ధపడక పోవచ్చు.. ఒకవేళ బీజేపీ ఓకే అన్నా... వైసీపీ కోర్ ఓట్ బ్యాంక్.. బీజేపీకి వ్యతిరే కంగా ఉంటుంది. పొత్తులు పెట్టుకుంటే దూరమవుతారు. అది చాలా నష్టం చేస్తుంది. అందుకే .. వైసీపీలో పొత్తు సాధ్యం కాదు. జనసేన పార్టీ ఒక్క బీజేపీతోనే నడిస్తే ఏం ప్రయోజనం ఉండదని అనుకుంటోంది. టీడీపీతో పొత్తు ఉన్నప్పుడు అటు అ?సంబ్లీలో ఇటు మండలిలో రెండు చోట్లా బీజేపీ ప్రాతినిధ్యం ఉంది. ఇప్పుడు పొత్తు లేకపోతే అలాంటిదేమీ ఉండదు. ఇప్పటికిప్పుడు పొత్తులపై నిర్ణయం తీసుకో కపోయినా ఓ క్లారిటీ సోము వీర్రాజుకు హైకమాండ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

# కేసీఆర్ వ్యూహాత్మక మౌనం ఎందుకు

**హైదరాబాద్:**



నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. పరేడ్ గ్రౌండ్ లో బహిరంగసభలో మాట్లాడారు. కేసీఆర్‌కు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై చాలా ఆరోపణలు చేశారు. నిజానికి ఈ సభలో కేసీఆర్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఆయన పాల్గొంటే ఇలాంటి ఆరోపణలు చేసేవారో లేదో తెలియదు కానీ.. ఆయన రాలేదు కాబట్టి మోదీ స్వేచ్చగా తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. నరేంద్రమోదీ విమర్శలపై బీఆర్ఎస్ పార్టీ నేతలు వెంటనే స్పందించారు. హరీష్ రావు దగ్గర్నుంచి కింది స్థాయి ఎమ్మెల్యే వరకూ స్పందించారు. అయితే ఎవీరు ఎవరు స్పందించినా... పెద్దగా లెక్కలోకి రాదు. కేవలం.. కేసీఆర్ స్పందిస్తేనే హాట్ టాపిక్ అవుతుంది.గతంలో అమిత్ షా లేదా ప్రధానమంత్రి వచ్చిన పోయిన తర్వాత వెంటనే కేసీఆర్ ప్రెస్ మీట్ పెట్టి వారు చేసిన ఆరోపణల్ని ఖండించడం కామన్ గా జరిగేది. గత ఏడాది ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చే ముందు ప్రెస్ మీట్ పెట్టి తనపై మోదీ విమర్శలు చేస్తారని.. అందుకే తానే ముందుగా సవాళ్లు చేస్తున్ననని ప్రకటించారు. అయితే ప్రధాని మోదీ కేసీఆర్ సంధించిన ప్రశ్నలపై స్పందించలేదు. ఆ మాటకొస్తే కేసీఆర్ ప్రభుత్వాన్ని పెద్దగా విమర్శించకుండా వెళ్లిపోయారు. ఆ సమయంలోనే తాను ప్రతీ రోజూ ప్రెస్ మీట్ పెడతానని హెచ్చరించారు కూడా. కేసీఆర్ ప్రెస్ మీట్ పెడితే కనీసం గంటన్నర మాట్లాడతారు. అన్ని అంశాలపై సమగ్రంగా స్పందిస్తారు. కానీ ఈ సారి మోదీ పర్యటనపై కేసీఆర్ సైలెంట్ గా ఉన్నారు. ఎలాంటి స్పందన వ్యక్తం చేయలేదు. ప్రధాని మోదీ స్పీచ్ అయిపోయిన తర్వాత హరష్ రావు సహా అనేక మంది నేతలు స్పందించారు. కొంత మంది ప్రెస్ మీట్లు పెడితే..మరికొంత మంది సోషల్ మీడియాలో స్పందించారు. మోదీనే తప్పు చేశారని వాదించారు. మోదీ పర్యటన రోజున సింగరేణి విషయంలో మహాధర్నాలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. అయితే కేటీఆర్ కూడా ప్రధాని మోదీ విమర్శలపై స్పందించలేదు. నిజానికి కేసీఆర్ బీజేపీ తో పూర్తిగా శత్రుత్వం వచ్చిన తర్వాత అసలు వెనక్కి తగ్గడం లేదు. అయితే ఇప్పుడు మాత్రం కేసీఆర్ ప్రెస్ మీట్లకు దూరంగా ఉన్నారు. ఇటీవల మహారాష్ట్ర నాయకులు బీఆర్ఎస్‌లో చేరే సమయంలో మోదీని విమర్శించే సమయా నికి వీడియో కెమెరాలను ఆపు చేయించారన్న వార్తలు వచ్చాయి. మోదీ చేసినవి చిన్న విమర్శలేం కాదు.. అవినీతి ఆరోపణలు చేశారు. అభివృద్ధి చేయడం లేదన్నారు. వీటికి కేసీఆర్ స్థాయి నేత కౌంటర్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ వాయిస్ గట్టిగా ప్రజల్లోకి వెళ్లదన్న వాదన వినిపిస్తుంది. మరి కేసీఆర్ ఎందుకు సైలెంట్ గా ఉంటున్నారో బిఆర్ఎస్ నేతలకు స్పష్టత లేదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అపర చాణక్యుడన్న బిరుదు ఉంది. రాజకీయాలంటే ఆవేశంతో కాదు ఆలోచనతో చేయాలనేది ఆయన వ్యూహం. అందుకే అవసరం అనుకున్నప్పుడు ఆవేశంగా స్పందిస్తారు. లేదు.. అంతకుమించిన వ్యూహం ఉందనుకున్నప్పుడు ఎన్ని విమర్శలు వస్తున్నాసైలెంట్ గానే ఉంటారు. చివరికి ఎవరూ ఊహించని విధంగా మలుపు తిప్పుతారు. ఇప్పుడు కూడా అలాంటిదేమైనా ఉందో లేదో కానీ.. కేసీఆర్ మౌనం మాత్రం బీఆర్ఎస్ నేతలకు పజిల్‌గా మారుతోంది.

## రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం వాసి మృతి

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గనీ బొల్లారంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని కృష్ణ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి స్వస్థలం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా. బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఎయిర్ ఇండియా విమానాల రద్దు

**రంగారెడ్డి**

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఎయిర్ ఇండియా ఎనిమిది విమానాలను రద్దు చేసింది. తిరుపతి ,బెంగళూరు, మైసూర్, హైదరాబాద్ విమానాలు రద్దు అయ్యాయి. ముందస్తు సమాచారం లేకుండా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. సాంకేతిక కారణాలతో రద్దు చేశామని ఎయిర్ ఇండియా తెలిపింది. అలయన్స్ ఎయిర్ లైన్స్ కు చెందిన నాలుగు ఫ్లైట్స్, అలాగే ఇతర ప్రాంతాల నుండి శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు రావల్సిన నాలుగు ఫ్లైట్స్ రద్దు అయ్యాయి.

## జూపల్లి, పొంగులేటిలపై సస్పెండ్ వేటు

**హైదరాబాద్**

ఇద్దరు బీఆర్ఎస్ సినీయర్ నేతలపై వేటు పడింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరోపణలతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి లను పార్టీ నుంచి సస్పెండ్ చేసారు. ఈ మేరకు బీ ఆర్ ఎస్ జాతీయ అధ్యక్షులు కె. చంద్రశేఖర్ రావు ఆదేశాలు జారీ చేసారు

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**చాగలమర్రి**



టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సలా నాగరాజు , టీఎన్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శ గుత్తి నరసింహ అన్నారు. బీసీ సంఘం మండలం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు కొత్తగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు సలా నాగరాజు ను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యమని అన్నారు. టీడీపీ హయాంలో బీసీ కాకొరేషన్ ద్వారా రుణాలు, పనిముట్లు అందించి ఆదుకున్నారని అన్నారు. బీసీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. టీడీపీ బలోపేతానికి బీసీలు ఐక్యతతో కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. చంద్రబాబు నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. నారా లోకేశ్ జిల్లాలో చేపట్టబోతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణయ్య, రామతీర్ధం, పీరయ్య , సిద్ధప్ప, పిచ్చయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

## కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జి.సృజన

**కర్నూలు**



జిల్లా కలెక్టర్ గా సృజన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 9.37 గంటలకు కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఛార్జ్ తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన కర్నూలు జిల్లాను రాష్ట్రంలో మంచి జిల్లాగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తా. ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటానని అన్నారు. తరువాత ఆమె జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేసే అవకాశం వచ్చింది.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా ను అభివృద్ధి చేద్దామని కలెక్టర్ అన్నారు.

## దాహార్తులకు మజ్జిగ వితరణ

**బద్వేలు**



వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చుట కొరకు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధవటం రోడ్డు, మైదుకూరు రోడ్డులో ఏర్పాటుచేసిన చలివేంద్రాలకు ముందుకు వచ్చి సహాయం అందించిన రోషన్ ఫౌండేషన్ అధినేత గాజు నాగరాజు యాదవ్ కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి వారికి అభినందనలు తెలియజేయడం జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు స్వయంగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వీ సుబ్బారావు తుమ్మలపెంట సురేష్ బాబు. వల్లం కొండు వెంకటరమణ, అనుమల శెట్టి సిద్దయ్య పాల్గొన్నారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# కొందరి వాడులా మారుతున్న ధర్మాన

**శ్రీకాకుళం:**



అన్నివేళలా అందరికీ అందుబాటులో ఉండే ధర్మాన ఇప్పుడు కొందరివాడిగా మిగిలిపోయారా అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మగవాళ్లు పోరంబోకులని వ్యాఖ్యానించిన ధర్మాన దీనిపై దుమారం రేగుతుందని తెలియనంత తెలివితక్కువ పొలిటీషియన్ కాదు. కాకపోతే ఏదో ఒక రూపంలో తన మాటలు, తన చేతలు నేటి ట్రెండ్ కు అనుగుణంగా వైరల్ అవ్వాలని కోరుకుంటున్నారో ఏమో గానీ ఈ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోలేదు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఆచీతూచి పద్ధతిగా మాట్లాడే ధర్మాన ఇప్పుడు నోరు జారుతు న్నారు. ఆసరా సభల నుంచి మహిళలు బయటకు వెళ్లకుండా గేట్లకు తాళాలు వేయించడం.. వారి కోసం వచ్చిన ఆటోలు తీయవద్దని చెప్పడం.. ధర్మాన స్టైల్ కానేకాదు. పెద్దసభ జరిగినపుడు కొంతమంది మధ్యలోనే వెళ్లిపోతారని, అంతమాత్రాన పెద్దగా చూడాల్సిన అవస రం లేదని, తన నియోజకవర్గంలో మనుషులు కాబట్టి తాను చనువుగా మాట్లాడానని ధర్మాన చెప్పుకొచ్చారు. అటువంటపుడు పత్రికల్లో ఆ కథనాలు వస్తే విమర్శించకుండా ఉండాల్సింది. ధర్మాన చనువుతోనే ఏకవచ నంతో పిలిచినా, మగవారిని పోరంబోకులన్నా, అది తన నియోజకవర్గం ప్రజల మీద తనకు ఉన్న హక్కు అని భావించవచ్చు. కానీ రోకు ఉన్న అమ్మ రోకట్లో తల పెట్టి దంచినా ఏమీ అనదన్న సామెత శ్రీకాకుళం లో ఉంది. అలా ధర్మాన మీద మోజు ఉంటే మనవాడేనని జనం ఫీలవుతారు. కానీ ఇప్పుడు ధర్మాన పట్ల ప్రజల్లో ఆ మోజు లేదు. ఈ విషయం ధర్మా నకు కూడా తెలుసు. అయినా కూడా నోరు జారుతు న్నారంటే ఆయన పూర్తిగా ఫ్రస్టేషన్లో ఉన్నారని అర్థం. అది పార్టీ వల్లా.. అధినేత వల్లా అనేది తెలియాల్సి ఉంది. ధర్మాన అంటే అభివృద్ధికి చిరునామా అని భావించి 2019 ఎన్నికల్లో ఆయన్ను ప్రజలు గెలిపించారు. కానీ నాలుగేళ్లలో నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ ఒక్క అభి వృద్ధి కార్యక్రమం కూడా జరగలేదు. కానీ ధర్మాన ప్రసాదరావు మాత్రం జగన్మోహనరెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాత జిల్లావ్యాప్తంగా నిధుల వరద పారిందని, వంశధార ఎత్తిపోతలకు సైతం నిధులు వచ్చేశాయని ప్రతి సభ లోనూ చెబుతున్నారు. అలాగే జగన్మోహనరెడ్డే లేకపోతే రాష్ట్రంలో ప్రజలు ఏమైపోయేవారో అన్నట్టే సెలవిస్తున్నారు. కానీ వాస్తవానికి ఆయన అంతరంగం అది కాదేమోనన్న భావన కలుగుతోంది. జనాన్ని మభ్య పెట్టగలమేమో గానీ అంతరాత్మకు సమాధానం చెప్పుకోలేమన్న భావన ఆయనలో ఉందేమో అనిపిస్తుంది. కొన్నాళ్లు నిధుల లేమి, మరి కొన్నాళ్లు కార్పొరేషన్ జనరల్ ఫండ్ పనులకు శంకుస్థాపన చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, అంతకుముందు పనులకు ప్రభు త్వం బిల్లులు చెల్లించకపోవడం, కార్యకర్తలు చేసిన పనులకు ఇంత వరకు సొమ్ములు రాకపోవడం వంటివి ధర్మానలో పార్టీ పట్ల నిరాసక్త తకు కారణమని కొంతమంది చెబుతున్నారు. సొంత పార్టీలో ఉంటూ విమర్శించలేక, మంత్రిగా ఉంటూ పనులు చేయించుకోలేక, ఆ విష యం బయటకు చెప్పుకోలేక ధర్మాన ఫ్రస్టేషన్లో పడ్డారని విశ్లేకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యేలకు ఎన్నికలపై దిశానిర్దేశం చేసేందుకు ముఖ్య మంత్రి అమరావతిలో సమావేశాలు నిర్వహిస్తే వరుసగా మూడు సమా వేశాలకు ధర్మాన గైర్హాజరయ్యారు. అదేమంటే పార్టీని, జగన్ నాయ కత్వాన్ని సభల రూపంలో జనంలోకి తీసుకువెళుతున్నానని, అంత కంటే ముఖ్యమంత్రి నిర్వహించే వర్క్ షాపులు పెద్దవి కావన్న భావన ఆయనలో ఉన్నట్లు తెలుస్తోంది. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్ర మాన్ని రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వైకాపా ప్రారంభించింది. కానీ శ్రీకా కుళం నియోజకవర్గంలో దానికి దశ, దిశ నిర్దేశించడానికి ధర్మాన ప్రసాదరావు అందుబాటులో లేరు. రెండు రోజుల క్రితమే హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆయన తనయుడు రామ్ మనోహర్నాయుడు కూడా విశా ఖలో ఉన్నారు. ప్రతి కార్యక్రమానికి ఒక కమిటీని నియమించి క్షేత్ర స్థాయి నుంచి అందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకునే ధర్మాన 'మా నమ్మకం నువ్వే జగనన్న'కు ఎటువంటి డైరెక్షన్లు ఇవ్వలేదు. ఒక కులం కోసం ఇతరులకు దూరం తాను గెలిచినా ఓడినా కొత్తగా వచ్చేది ఏమీ లేదని పేర్కొంటున్న ధర్మాన ఇప్పటికీ ఓటు బ్యాంక్ కోసం రాజకీయాలు చేయాల్సి రావ డం విడ్డూరం. ఆయన గెలుపు ఓటములకు అతీతుడు. అయినా కూడా ఓ వర్గానికి దగ్గర కావాలని ఇటీవల తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా మిగతా సామాజికవర్గాల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటు న్నారు. నగరంలో కళింగకోమట్లు తనకు ఎప్పుడూ పూర్తిస్థాయిలో ఓట్లే యడం లేదని భావించిన ధర్మాన ఇటీవల వారి మనసు గెలుచు కోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. మార్కెట్లో కళింగ కోమ ట్లంతా తనకు వ్యతిరేకంగా ఉన్నారని తేలిన తరువాత కొత్తవారిని తన వెనుక తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పెద్దిన మురళీకృష్ణ ఇంటికి నలుగురు కళింగకోమట్లను వెంటబెట్టుకుని ఫిబ్రవరి 27న మంగువారితోటకు వెళ్లారు. ఆ డివిజన్లో తెలుగుదేశం పార్టీలో ఉన్న కళింగ కోమట్లు సైతం ధర్మాన అభిమానులే. అది కాకుండా పార్టీ క్యాడర్ ఉండనే ఉంది. వీరందరినీ కాదని కేవలం కళింగ కోమట్లకు మాత్రమే పిలుపు రావడంతో ఆ డివిజన్లో ధర్మాన కోసం దెబ్బలు కాసిన క్యాడర్ గుర్రుగా ఉంది. ఆ తరువాత వారం కేబుల్ ఆపరేటర్ తంగుడు రాజు ఇంటికి కూడా వెళ్లి కళింగ కోమట్లకు తాను ఫ్రెండ్లీ అని ధర్మాన చెప్పుకొ చ్చారు. దీంతో నగరంలో కళింగ కోమట్లు తప్ప మిగతా కులాలు లేవా... తాము ధర్మాన శ్రేయోభిలాషులం కాదా అన్న చర్చ మొదలైంది. ఈ విష యం కూడా ధర్మానకు తెలుసు. అయినా కూడా ఆయన కళింగకోమ ట్లను కలవడానికి వెనుకడుగు వేయడం లేదు. డబ్బులు ఉన్న కోమట్లకు ఫోన్ చేసి ఆత్మీయ సమావేశాలు పెట్టమని చెబుతున్నారట. అయితే పార్టీ పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో తమను ఇబ్బంది పెట్టకండంటూ చాలామంది తప్పించుకు తిరుగుతున్నట్లు భోగట్టా. అధికార పార్టీ పరిస్థితి కళింగకోమట్లలో ఇలా దిగజారిపోయింది. ప్రతిపక్షంలో ఉన్నపుడు కనీసం ఒక 12మంది కళింగకోమటి నేతలు వ్యాపారాలను పక్కనపెట్టి ధర్మాన కోసం తెగించి పని చేశారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కళింగ కోమట్లలోనూ అసంతృప్తి కళింగకోమట్లకు ఎన్నికల ముందు జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేరలేదని టీడీపీ కళింగకోమటి నేత కోరాడ హరి గోపాల్ ధ్వజమెత్తడంతో డ్యామేజ్ కంట్రోల్ కోసం కళింగకోమటి నేతలు సూరిబాబు, కోణార్క్ శ్రీనుల నేతృత్వంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు విశాఖ మధురవాడలో జరిగిన ఒక సమావేశానికి ఉత్త రాంధ్ర ఇన్చార్జి వైవీ సుబ్బారెడ్డి వస్తున్నారని తెలుసుకుని ఆయన ముందు తమ డిమాండ్లను ఉంచుదామని ఇక్కడి నుంచి బయలుదేరారు. కానీ అక్కడికి వెళ్లిన తరువాత సుబ్బారెడ్డి కళింగకోమట్ల సత్రం కోసం కొండపైన స్థలం ఇవ్వమని, కింద ఎక్కడో కట్టుకోండంటూ సెలవి చ్చారట. ఇక మిగిలిన డిమాండ్లు వినకుండానే ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించి వచ్చిన తరువాత మాట్లాడదామంటూ పంపించేశారని స్వయంగా కళింగకోమటి నేతలే చెబుతున్నారు. మార్కెట్లో పూర్తిగా ధర్మాన పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దానికి కారణాలను అన్వే షించకుండా కార్యవర్గాన్ని మార్చేద్దామన్న భావనకు కొందరు వచ్చారు. ప్రస్తుతం ఉన్నవారిని తీసేసి కొత్తగా హోల్సేల్ వర్తకుడు కోరాడ గోవింద్ (ప్రియా గోవింద్ కు పగ్గాలు అప్పగించాలని చూశారు. కానీ మార్కెట్లో కొత్త నాయకత్వం ఇప్పుడు ధర్మాన వెనుక వెళ్లేందుకు సిద్ధంగా లేదు. ప్రస్తుతం ఉన్నవారు పార్టీ మార కుండా ఉండడమే గొప్పన్న సంకేతాలు వెళ్లాయి. 2019లో ధర్మాన గెలిచిన తరువాత మంత్రి పదవి దక్కనంత వరకు ఆయన మీద ప్రజలకు సానుభూతి ఉండేది. ప్రస్తుతం అదీ కనిపించడం లేదు. ధర్మాన కూడా 2024లో గెలిచే పరిస్థితి లేదని భావించారో ఏమో అందరినీ దూరం పెడుతూ వస్తున్నారు. ఆయన వ్యవహారశైలిని కేడర్ జీర్ణించుకోలేకపోతుంది.

# సీఎంఆర్ఎఫ్ లో నకిలీలు

**బ్రోకర్లతో చేతులు కలిపిన పీఏలు, పీఎస్‌లు**

**నల్గొండ:**

సీఎం రిలీఫ్ ఫండ్ లో నకిలీ దరఖాస్తులు బెడద ఎక్కువైంది. తప్పుడు రిపోర్టులు సమర్పించి లక్షల్లో డబ్బులు గుంజుతున్నారు. ఈ ఎపిసోడ్ లో రాజకీయ లీడర్ల ప్రమేయం ఉందనే అనుమానాలు ఉన్నాయి. గత మూడు నాలుగేళ్లుగా ఈ దందా జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే అనుమానం ఉన్న దరఖాస్తుల విషయంలో క్రాస్ చెక్ చేసినప్పుడే మాత్రమే కొన్ని బయటికి వస్తున్నాయి. లేకపోతే తప్పుడు బిల్లులకు కూడా డబ్బులు చెల్లిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది,ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న నిరుపేదలకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం చేస్తోంది. అయితే పేషంట్ నేరుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకనే అవకాశం లేదు. అప్లికేషన్లను స్థానిక ఎమ్మెల్యే,ఎంపీ,ఎమ్మెల్సీలకు ఇస్తే, వారు తమ సిఫారసు లేఖలను అటాచ్ చేసి, సీఎంఆర్ఎఫ్ విభాగానికి పంపుతున్నారు. వచ్చిన అప్లికేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగ్గా ఉన్నాయని భావించినప్పుడే మాత్రం రోగి పేరుతో చెక్ తయారు చేస్తారు. ఆ చెక్ ను నేరుగా రోగి ఇంటికి పంపకుండా సిఫారసు చేసిన ప్రజాప్రతినిధికి పంపుతారు. అప్లికేషన్ ఇచ్చిన మొదలుకుని చెక్ వచ్చే వరకు ఎమ్మెల్యేలు,ఎంపీ,ఎమ్మెల్సీలు కీలకంగా మారుతున్నారు. దీంతో కొందరు ప్రజా ప్రతినిధుల పీఏలు,పీఎస్ లు, బ్రోకర్లతో చేతులు కలిపి నకిలీ అప్లికేషన్లను ఎంకరేజ్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. ముందే కుదుర్చుకున్న ఒప్పందం మేరకు రోగి, అసుపత్రి, బ్రోకర్ మధ్య వాటాలు జరుగుతున్నట్టు సమాచారం. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు కోసం కావాల్సిన అన్ని సర్టిఫికేట్లు పక్కగా ఉంటాయి. అప్లికేషన్ తో పాటు ఆధార్,తెల్లరేషన్ కార్డు, ఆసుపత్రి ఇచ్చిన డిశ్చార్జి సర్టిఫికేట్ తప్పకుండా సమర్పిస్తారు. కాని రోగికి అసలు రోగం ఉండదు. కాని ఆ రోగానికి ట్రీట్మెంట్,ఆపరేషన్ జరుగుతాయి. ట్రీట్మెంట్ చేసిన డాక్టరు పేరు, ఆపరేషన్ జరిగిన టైమ్,చివరికి డిచార్జీ సర్టిఫికేట్ కూడా కచ్చితంగా ఉంటాయి. ఇందుకు కావాల్సిన పేపర్ వర్క్ పక్కగా చేస్తారు. ఈ ప్రక్రియలో కేవలం దరఖాస్తుచేసిన వ్యక్తి మాత్రమే నిజం. మిగతా అన్ని సృష్టించి రాజకీయ నాయకుల ప్రమేయంతో దరఖాస్తు చేసి డబ్బులు లాగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహబూబ్ బాద్ జిల్లాల నుంచి వచ్చే దరఖాస్తుల్లో ఎక్కువగా నకిలీలు ఉంటున్నట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అక్కడి నుంచి వచ్చే అప్లికేషన్లపై ఒకటికి రెండు సార్లు స్క్రూటినింగ్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఆసుపత్రులకు ఒకటికి రెండు సార్లు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఆ జిల్లాల నుంచి వచ్చిన వందల అప్లికేషన్లను గుర్తించి పక్కన పెట్టినట్టు తెలుస్తున్నది. అయినా కొన్ని సార్లు నకిలీ దరఖాస్తులను పట్టుకోలేక పోతున్నరనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన జ్యోతి, లక్ష్మి, ధీరా వత్, శివలు సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన ఆసుపత్రుల బిల్లులు చూసిన తర్వాత అనుమానం వచ్చిన రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. నకిలీ బిల్లులతో ప్రభుత్వ సొమ్మును కాజేసేందుకు ప్రయత్నించారని రెవెన్యూ డిపార్ట్మెంట్ (సీఎంఆర్ ఎఫ్) సెక్షన్ ఆఫీసర్ డీఎస్ఎన్ మూర్తి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు. నకిలీ దరఖాస్తులు ఎలా వచ్చాయి. రోగుల ప్రమేయం ఉందా? ప్రజాప్రతినిధుల ఆఫీసుల్లో ఉండే స్టాఫ్ ప్రమేయం ఉందా? లేకపోతే హైదరాబాద్ లో పనిచేసే ప్రమేయం ఉందా?ఇందులో ఎవరి వాటా ఎంత?అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది.

# బండి సంజయ్ కు క్రేజ్

**కరీంనగర్ :**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. పదో తరగతి పేపర్ లీకేజీ కేసులో జైలుకు వెళ్లి బెయిల్ మీద బయటకు వచ్చిన బండి సంజయ్‌పై అటు బీజేపీ శ్రేణుల్లో... ఇటు అభిమానుల్లో సింపతీ ఓ రేంజ్‌లో పెరిగింది. అయితే.. అది మోదీ పర్యటన వేదికగా బయటపడింది. మోదీ పర్యటన సందర్భంగా.. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించి బహిరంగ సభలో బండి సంజయ్ పాల్గొన్నారు. అయితే.. సభా స్థలికి చేరుకున్న బండి సంజయ్ చూసిన పార్టీ శ్రేణులు.. ఆయనకు గ్రాండ్‌గా వెల్ కం చెప్పారు. దారిపొడవునా ఆయనతో సెల్ఫీలు తీసుకుంటూనే ఉన్నారు. ఇదంతా ఒకఎత్తైతే.. గ్రౌండ్‌లో ఎంటరవగానే ఆయనను తమ భుజాలపై ఎత్తుని వేదిక వరకు మోసుకెళ్లి తమ అభిమానాన్ని తెలిపారు కార్యకర్తలు. ఇదిలా ఉంటే.. మోదీ సభ ముగిసిన అనంతరం.. వీవీఐపీ గ్యాలరీ నుంచి బండి సంజయ్ బయటకు వచ్చే సమయంలో.. కార్యకర్తలు, అభిమానులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. బండి సంజయ్‌ను మళ్లీ తమ భుజాల మీద మోసుకుంటూనే బయటకు తీసుకొచ్చారు. అయితే.. బయటకు తీసుకొస్తున్న సమ యంలో.. అభిమానులు ఆసక్తికర నినాదాలు చేశారు. సీఎం సంజయ్.. సీఎం సంజయ్.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. తనను దించాలని బండి సంజయ్ కోరినా.. కార్యకర్తలు ఏమాత్రం పట్టించుకోకుండా నినాదాలు చేసుకుంటూ బయటి వరకు మోసుకొచ్చారు. అయితే.. కార్యకర్తలు తనపై చూపిస్తున్న అభిమానానికి బండి సంజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన కళ్లు చమర్చాయి. ఇదిలా ఉంటే.. బండి సంజయ్ సీఎం కేసీఆర్‌పై ఆసక్తిర వ్యాఖ్యలు చేశారు. మోదీ సభకు సీఎం కేసీఆర్ రాకపోవటంపై మండిపడ్డారు. సీఎం కేసీఆర్ కోసం వేదికపై కుర్చీ వేశామని.. చాలా సేపు ఆయన కోసం ఎదురు చూశామని.. ఆయన వస్తే సన్మానం చేసేందుకు శాలువా కూడా తీసుకొచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు రాష్ట్రానికి ప్రధాని మోదీ వస్తే.. సీఎం కేసీఆర్ ఎందుకు రాలేదంటూ నిలదీశారు. కేసీఆర్‌కు అంత ముఖ్యమైన పని ఏముందని.. ఆయన ఈరోజు షెడ్యూల్‌ను బయటపెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ విగ్రహానికి ప్రాణం పోసిన సుతార్

**హైదరాబాద్ :**

దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం హైదరాబాద్‌లో ఈ నెల 14వ తేదీన ఆవిష్కరించనున్నారు. 125 అడుగుల భారీ అండేద్కర్ విగ్రహాన్ని నగరనడిబొడ్డున.. హుస్సేన్ సాగర్ తీరాన ఆవిష్కరించబోతున్నారు. అయితే.. చరిత్రను ఠీవీగా తలెత్తుకుని నిలబడేలా చేసిన ఈ అత్యంత భారీ విగ్రహానికి జీవం పోసింది.. 98 ఏళ్ల వయసున్న ఈ విశ్వకర్మే. మహా రాష్ట్రలోని ధూలె జిల్లాలోని గోందూరు గ్రామానికి చెందిన స్థపతి రాంజీ సుతార్.. చేతిలో జీవం పోసుకున్న అత్యంత భారీ స్థాయి విగ్రహాల లిస్ట్ తెలిస్తే.. నోరెళ్లబెట్టకతప్పదు. ఎక్కడ చరిత్ర నిటారుగా తలెత్తుకుని.. ఠీవీగా నిలబడి చూస్తుందో.. అక్కడ స్థపతి రాంజీ సుతార్ చేతిలో జీవం పోసుకున్న విగ్రహం ఉంటుంది అనేంతగా.. ప్రసిద్ధి చెందారు. స్టాట్యూ ఆఫ్ యూనిటీకి నిదర్శనంగా ప్రపంచంలోనే అతిపెద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించింది కూడా స్థపతి రాంజీ సుతారే. అయితే.. సుతార్ నిర్మించిన ఎన్నో విగ్రహాలు, ప్రతిమలు దేశంలోనే కాకుండా విదేశాలకు తరలివెళ్లి.. అక్కడ మన చరిత్రను తలెత్తుకునేలా చేస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహమైన స్టాట్యూ ఆఫ్ యూనిటీని సుతారే రూపొందించారు. 182 మీటర్ల (597 అడుగులు) ఎత్తుతో సర్ధార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని.. గుజరాత్‌లోని నర్మదా నదిపై కేవడియా కాలనీలో వడోదర నగరానికి ఆగ్నేయంగా 100 కిలోమీటర్ల దూరంలో సర్దార్ సరోవర్ ఆనకట్టకు ఎదురుగా నిర్మించారు. భారతదేశంలోని 562 రాచరిక రాష్ట్రాలను ఏకం చేసి ఒకే యూనియన్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేయడంలో పటేల్ చూపించిన నాయకత్వానికి గుర్తుగా.. స్టాట్యూ ఆఫ్ యూనిటీ పేరుతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. దేశం ఎంతో గర్వంగా చెప్పుకునే చెక్కుచెదరని చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా ఉక్కుమనిషి విగ్రహాన్ని రూపొందించి సుతార్.. తన ప్రతిభను మరోసారి ప్రపంచానికి చాటారు. ఈ విగ్రహాన్ని మొత్తం పూర్తి చేసేందుకు 57 నెలలు పట్టింది. మరోవైపు.. సుతార్ చేతితో.. 45 అడుగుల ఎత్తైన చంబల్ స్మారక చిహ్నాన్ని, ఎత్తైన మహాత్మా గాంధీ ప్రతిమను కూడా నిర్మించాడు. సుతార్ చేతిలో జీవం పోసుకున్న మహాత్ముని విగ్రహాలు ఎన్నో ఇతర దేశాలకు పంపారు కూడా. ఇవే కాదు.. భారత పార్లమెంటు వద్ద కూర్చున్న స్థితిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని రూపొందించింది కూడా సుతారే. ఆ ప్రతిమకు సంబంధించిన పెద్ద ప్రతిరూపాన్ని విధానసౌధలో కూడా ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే.. బెంగుళూరు అంతర్జాతీయ విమానా శ్రయంలో 108 అడుగుల ఎత్తైన కెంపె



గౌడ విగ్రహానికి రూపకర్త కూడా స్థపతి రామ్ జీ సుతారే. రామ్ వంజీ సుతార్ 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని ధూలే జిల్లాలోని గొండూరు గ్రామంలోని ఓ విశ్వకర్మ కుటుంబంలో జన్మించారు. 1952లో అతను ప్రమీలను వివాహం చేసుకున్నారు. 1999లో భారత ప్రభుత్వం పద్మశ్రీతో సుతార్‌ను సత్కరించగా.. 2016లో పద్మభూషణ్ ఇచ్చి గౌరవించింది. దేశ సంస్కృతిని కాపాడటంలో సుతార్ చేసిన సేవలకు గానూ.. 2018లో ఠాగూర్ అవార్డును కూడా అందుకు న్నారు. ట్యాంక్ బండ్ వద్ద ఎన్టీఆర్ గార్డెన్స్‌ను ఆనుకొని ఉన్న 36 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతివనాన్ని నిర్మించారు. ఇందులో 2 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఆ పక్కనే మ్యూజియం, సమావేశ మందిరం కూడా నిర్మించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నిర్మాణం కోసం 791 టన్నుల స్టీల్‌తో పాటు 96 మెట్రిక్ టన్నుల ఇత్తడిని ఉపయోగించారు. 425 మంది సిబ్బంది ఈ విగ్రహ నిర్మాణం పనుల్లో భాగస్వామ్యమయ్యారు. విగ్రహానికి పాలీయురేథీన్ తో పాలిషింగ్ చేస్తున్నారు. విగ్రహం ఎత్తు 125 అడుగులు అయినప్పటికీ.. బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు, వెడల్పు 45 అడుగులు ఉంది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.146 కోట్లుగా అంచనా. ఈ విగ్రహన్ని రాం జీ సుతార్, ఆయన తనయుడు అనిల్ సుతార్ డిజైన్ చేశారు. 2016 ఏప్రిల్ 14న ఈ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. వివిధ కారణాల వల్ల ఆలస్యమవుతూ.. ఏడేళ్ల తర్వాత ఇప్పుడు(2023 ఏప్రిల్ 14న) ప్రారంభం కానుంది.

# ఇక్కడ ఐస్ క్రీం తింటే అనారోగ్యం పాలే

**ఆరోగ్యం పై తల్లిదండ్రులు పిల్లలు గగ్గోలు**

**కానరాని పర్యవేక్షణ అధికారులు**

**అల్లూరి సీతారామరాజు**

ఐస్ క్రీమ్ అంటే తినని వారు ఉండరు చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ళ వరకు ఈ చల్లటి పదార్థాన్ని తినేందుకు తెగ ఆసక్తి చూపిస్తుంటారు అలాగే విందు వినోదాల్లో శు భకార్యాల్లో అందరూ తింటుంటారు అంతలా ఇష్టపడే ఈ ఐస్ క్రీములు తినాలంటే ఇప్పుడూ ఒకటికి పది సార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు, పిల్లలు అంటున్నారు వివరాలు ఇలా ఉన్నాయి అరకులోయ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఆర్ అండ్ బి కు వెళ్లే రోడ్డు పక్కన స్టార్ అన్నపూర్ణ నిర్వాహకుడు కాలం చెల్లిన పూర్తిగా పాడైన ఐస్ క్రీం,కోన్ లు విక్రయాలు కొనసాగిస్తున్నారు ఇప్పుడు వాటిని తిన్నవారి పరిస్థితి ఏంటన్న దానిపై సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతుంది ఎప్పటికప్పుడు వీటిపై కన్నెయ్యాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం వల్లే కాలం చెల్లిన ఐస్ క్రీములు,కోన్లు విక్రయాలు జోరందు కున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి దానికీ తోడు అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి ముఖ్యంగా చిన్నపిల్లలు కాలం చెల్లిన ఐస్ క్రీములు తినడం వలన ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతు న్నాయని భయాందోళనకు గురౌతున్నారు దీంతో ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైన సంబంధింత అధికారులు స్పందించి కాలం చెల్లిన, ఐస్ క్రీమ్ లపై నిఘా ఉంచాలని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేకపోతే బారి మూల్యం చెల్లించాల్సి వస్తోందని స్థానిక ప్రజలు తల్లిదండ్రులు,పిల్లలు కోరు తున్నారు.

## బాజీరెడ్డి ప్రసంగానికి అడ్డుపడిన మహిళ

**నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన – యాదవ మహా సభ మీటింగ్ రసాభాసగా మారింది. తనను అవమానించారంటూ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ ముందే వాగ్వాదానికి జిల్లా యాదవ సంఘం మహిళ అధ్యక్షురాలు మంజుల దిగింది. బాజిరెడ్డి ప్రసంగానికి మంజులా యాదవ్ అడ్డుపడింది. జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ తనను అసభ్య పదజాలం తో దూషించాడని ఆరోపించింది. బాజిరెడ్డి ముందే తీవ్ర వాగ్వివాదం నెలకొంది.

## టెన్త్ పరీక్షకు హాజరయిన విద్యార్థి హరీష్

కమలాపూర్ పదవ తరగతి పరీక్షకు ఏంజెపి విద్యార్థి దండెబోయిన హరీష్ సోమవారం హాజరయ్యాడు. టెన్త్ హిందీ పేపర్ మాల్ ప్రాక్టీస్ ఘటనలో విద్యార్థి హరీష్ కు ఊరట లభించింది. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు రాసేందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. టెన్త్ హిందీ పేపర్ బయటకు వచ్చిన ఘటనలో హరీష్ను అధికారులు డిబార్ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈరోజు హరీష్ పరీక్షకు హాజరుకావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేసారను. విద్యార్దు హరీష్ మాట్లాడుతూ నేను ఎగ్జామ్ రాసేందుకు కోర్టు అనుమతికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలని అన్నాడు.

## ఎమ్మెల్యే గంప ఇంటిని ముట్టడించిని ఎన్ఎస్ యూఐ కార్యకర్తలు

**కామరెడ్డి**

కామారెడ్డి పట్టణంలోని అశోక్ నగర్ కాలనీ లో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం నాడు స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంటిని ఎన్ ఎస్ యూ ఐ కార్యకర్తలు ముట్టడించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. టి.ఎస్.పి.ఎస్.సి. పేపర్ లీకేజీ నిరసనగా గంప ఇంటి ముట్టడికి యత్నం చేసారు. చివరకు పోలీసులు ఆందోళనకారులను అరెస్ట్ చేసారు.

## చదువులకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించిన 108 ఏళ్లు బామ్మ

**చెన్నై:**

తమిళనాడులోనిథేని జిల్లాకు చెందిన కమలకన్నివయసు 108 ఏళ్లు. చదువులకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించారు. కేరళప్రభుత్వం నిర్వహించిన పరీక్షలలో పాసై తమిళం, మలయాళభాషలను నేర్చుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. రెండో తరగతి వరకు చదివిన కమలకన్ని కేరళలోని ఇడుక్కి ప్రాంతానికి వలసపోయి కూలీపనులను చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. పేదరికం కారణంగా చిన్నప్పుడు చదవలేకపోయిన కమలకన్నికి ఇటీవలే చదవాలనే కోరిక కలిగింది. కేరళ ప్రభుత్వ నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమం సంపూర్ణ శాస్త్ర భాగంగా తమిళ, మలయాళ భాషలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్నారు. అక్కడి ప్రభుత్వ శిక్షణా సంస్థలో చేరి పట్టుదలగా చదివారు. తన మాతృభాష తమిళం, అటు మలయాళ భాషను నేర్చుకున్నారు. ప్రస్తుతం ఆమె రెండు భాషలలో రాయగలుగుతున్నారు. ఈ పరీక్షలలో ఆమె 100 మార్కులకు గాను 97మార్కులు సంపాదించుకున్నారు.

## సైదాబాద్ లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం

**హైదరాబాద్**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబిసి మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 14 అంటే డా. బిఆర్ అంబేద్కర్ జయంతి వరకు జరిగే " బస్తి బస్తికి ఓబీసీ – ఇంటి ఇంటికి బీజేపీ" కార్యక్రమాన్ని మాలక్ పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ లో తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా ఇంఛార్జి లింగాల హరి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు,

## కత్తితో హల్ చల్

**గూడూరు**

తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని ముత్యాల పేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రకాష్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి కత్తితో హల్చల్ చేశాడు దీంతో వ్యాపారస్తులు రోడ్డుపై ఉండే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు . ప్రకాష్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి గూడూరు పట్టణంలోని ముత్యాల పేట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కత్తితో హల్ చల్ చేశాడు భయభ్రాంతులకు గురైన ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు పోలీసులు రావడంతో ప్రకాష్ ఒక దుకాణంలోకి వెళ్లి దాక్కున్నాడు పోలీసులు చాకచక్యంగా అతని పట్టుకొని స్టేషన్కు తరలించారు ఇతని బంధువులు వెంకటగిరిలో ఉన్నారని తెలియడంతో పోలీసులు వారికి సమాచారం అందించారు ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు .

# హైదరాబాద్ రోడ్లపై బైక్ విన్యాసాలు

**హైదరాబాద్ :**

బైక్ రేస్ ? యువత రయ్ రయ్ మంటూ రోడ్లమీద దూసుకుపోతారు. ఖరీదైన బైక్ లు రోడ్ల మీద విన్యాసాలు చేస్తాయి. సోషల్ మీడియా లైక్ ల కోసం బైక్ పై వెర్రి వేషాలు వేస్తూ ప్రాణాలు పోగొట్టుకున్నాడు. బైక్ రేస్ ల సంస్కృతి వల్ల యువకులు పాడైపోతున్నారని, ప్రాణాల మీదకి తెచ్చుకుని కన్నవారికి శోకం మిగులుస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా యువత పట్టించుకోవడం లేదు. యువకులు నిత్యం రోడ్డుపై హంగామా సృష్టిస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు మాత్రం చలాన్లకే పరిమితం చేస్తున్నారు. అయితే తాజాగా నగరంలో బైక్ రేసింగ్ ఆగడాలు మితిమీరాయి. రాత్రి మలక్ పేట, చంచల్ గూడ ప్రాంతాల్లో బైక్ రేసింగ్ అలజడి సృష్టించింది. దీంతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.మలక్ పేట, చంచల్ గూడ ప్రాంతాల్లో బైక్ రేసింగ్ లతో యువకులు రెచ్చిపోయారు. కొంతమంది యువకులు సాయంత్రం, తెల్లవారుజామున రేసింగ్‌లు చేస్తున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అత్యంత వేగంతో ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలని లైక్ ల కోసం యువత తమ బాధ్యతగా మైన జీవితాన్ని పనంగా పెట్టి విన్యాసాలు చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. యువకులు 100 నుండి 150 కి.మీ వేగంతో అత్యంత వేగంగా రోడ్లపై స్పీడ్ పెంచి సైలెన్సర్ తో విపరీతమైన సౌండ్ లు చేస్తూ వాహనదారులకు, ప్రజలకు భయాందోళనకు గురిచేస్తున్నారు. బైక్ నడుపుతున్న వారందరూ మైనర్లు ఉండటం గమనార్హం. బైక్ నడుపుతున్నవారికి 18 ఏళ్లు కూడా నిండినట్లు లేదని, వారంతా మైనర్ బాలురు అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా వారందరూ బైక్ ను 150 స్పీడ్ తో నడుపుతూ వాహనదారులకు భయభ్రాంతులకు గురి చేస్తుంన్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ తరహా సంస్కృతికి చెక్ పెట్టాలని, మలక్ పేట, చంచల్ గూడ ప్రాంతాల్లో బైక్ రేసింగ్ లతో వెళ్ళే ప్రాంతాల్లో నిఘా ఉంచాలని కోరుతున్నారు. రాత్రి సమయంలో సౌండ్స్ రావడంతో నిద్రలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా బైక్ లు నడిపే వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

# ఎమ్మెల్యే శంకర్‌రావు అవినీతి అక్రమాలను నిగ్గుతేలుస్తా

### టీడీపీ నేత కొమ్మాలపాటి శ్రీధర్

**పల్నాడు :**



ఎమ్మెల్యే శంకర్‌రావు అవినీతి అక్రమాలను నిగ్గుతేలుస్తామని టీడీపీ నేత కొమ్మాలపాటి శ్రీధర్ హెచ్చరించారు. అయితే తనను ఎన్ని ఇబ్బందులు పెట్టినా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. పెదకూరపాడు ప్రజల తరపున నిత్యం పోరాడుతానని ప్రకటించారు. టీడీపీ నేత కొమ్మాలపాటి శ్రీధర్ ఇంటికి చేరుకున్నారు. 7 గంటల పాటు వాహనాల్లో తిప్పిన పోలీసులు ఆయన ఇంటి వద్ద వదిలేశారు. శంకర్‌రావును ఇంటికి సాగనంపేవరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బహిరంగ చర్చకు ఏ రోజైనా తాను సిద్దమని శ్రీధర్ ప్రకటించారు. అమరావతిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, దీనిపై తాను ఎప్పుడైనా చర్చకు సిద్ధమని శ్రీధర్ తేల్చి చెప్పారు. నదిలో తవ్విన గోతుల వల్లే అనేకమంది చనిపోతున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమన్నారు. అలాగే ఇసుక దోపిడీ, మట్టి మాఫియా, ఇళ్ల నిర్మాణంపై చర్చకు కూడా సిద్ధమన్నారు. వైసీపీ హయాంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, ఆధారాలతో సహ చర్చకు వచ్చామని కొమ్మాలపాటి శ్రీధర్ ప్రకటించారు.ఇసుక అక్రమ తవ్వకాలపై పెదకూరపాడు ఎమ్మెల్యే శంకర్‌రావు, కొమ్మాలపాటి శ్రీధర్ చేసుకున్న సవాళ్ల తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇరుపక్షాలు అవినీతిపై చర్చించి అమరేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామని సవాళ్లు విసిరారు. ముందుగా శ్రీధర్ పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి అమరలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శంకర్‌రావు కూడా అమరలింగేశ్వర ఆలయానికి వచ్చారు. తాను ఆధారాలతో వచ్చానని, ఏ తప్పు చేయలేదని అన్నారు. టీడీపీ వాళ్లు ప్రమాణం చేస్తే.. తాను కూడా ప్రమాణం చేస్తానని అన్నారు. అప్పటి వరకు ఆలయం వద్దే ఉంటానని స్పష్టం చేశారు. కాగా ఎమ్మెల్యేకు మద్దతుగా వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కొమ్మాలపాటి శ్రీధర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పోలీసులు శ్రీధర్‌ను అడ్డుకుని బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేసి పలువురిని అరెస్ట్ చేశారు. దీంతో పెదకూరపాడులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొన్ని రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలపై శంకరరావు, శ్రీధర్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అమరలింగేశ్వర ఆలయం సమావేశం అవుదామని సవాళ్లు విసురుకున్నారు.ఈ నేపథ్యంలో అమరావతి పరిసరాల్లో ఆదివారం రాత్రి వరకు పోలీసులు 144 సెక్షన్ విధించారు. టీడీపీ నేతలకు 149 సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేశారు. అమరావతి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. 5 మండలాల్లో 200 మంది నేతలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. మరోవైపు టీడీపీ కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజలను కూడా పోలీసులు అరెస్టు చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. పసుపుచీర కట్టుకున్నాన్న కారణంతో తనను అరెస్టు చేశారని ఓ మహిళ వాపోయింది. ఉద్రిక్తతల నేపథ్యంలో అమరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిని పోలీసులు మూసివేశారు.

# మంగోల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన మంత్రులు

**సిద్దిపేట**

నాలుగు జిల్లాలకు తాగు నిరందించే ట్రయల్ రన్ నిర్వహణలో భాగంగా మంగోల్ లో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకరరావు సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎం ఓఎస్డీ స్మిత సబర్వాల్, కలెక్టర్ ప్రాశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గోన్నారు.మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ 1212 కోట్లతో తాగునీటి వసతి చేపట్టాం. 1900 అవాసలకు, 9 నియోజకవర్గాలోని 16 మున్సిపాలిటీ లకు తాగునీరు అందనుంది. మిషన్ భగీరథ దేశంలోనే తెలంగాణకు మకుటాయమానంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్రమే పార్లమెంట్ లో ఖితాబిచ్చారు. అవార్డుల మీద అవార్డులు ఇచ్చారు. తెలంగాణ ను చూసి నేర్చుకోవాలని ఇతర రాష్ట్రాలకు చెప్పింది. కానీ కేంద్రం మాత్రం తెలంగాణకు సహకరించదు. మన పథకాలను కేంద్రం కాపీ కొడుతున్నది. వర్షపు నీళ్లను ఫిల్టర్ చేసి ఇంటింటికి నీళ్లు ఇస్తే, ఇతర రాష్ట్రాల్లో ఇచ్చేది బోర్ల నీళ్లు. మిషన్ భగీరథ కు నిధులు ఇస్తామని కేంద్రం ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు.మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ మిషన్ భగీరథ చరిత్రలో సుస్థిరమయిన రోజు.. దేశంలోనే ప్రతిరోజు 540 ఎంఎల్డీ సామర్థ్యంతో నీటి విడుదల. లేటెస్ట్ టెక్నాలజి, ఈక్విప్ మెంట్ వాడం. ఈ రోజు 50 శాతాన్ని ట్రయల్ రన్ చేపట్టము. ఈ స్కిం అంతా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే చేపట్టము. ప్రపంచంలోనే మానవులు నిర్మించిన అతిపెద్ద రిజర్వాయర్ మల్లన్నసాగర్. ఏడు జిల్లాలు, 10 నియోజకవర్గాలోని 1922 గ్రామాలకు నీటి సరఫరా అవుతుంది. హైదరాబాద్ కు మేలు జరగబోతుంది.. ఇప్పటి వరకు 300 మిలియన్ లిటర్లు సరఫరా అవుతుండగా, ఇప్పుడు మరో 300 మిలియన్ లీటర్ల నీటి సరఫరాకు అవకాశం ఏర్పడింది. భవిష్యత్ లో పెరిగే హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడు జిల్లాలోని 10 నియోజకవర్గాలకు గ్రావిటీ ద్వారా నీటి సరఫరా అవుతుంది. భవిష్యత్ 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఈ పథకాన్ని రూపొందించాము. జూన్ నెలలో పూర్తి కావాల్సిన ఈ పథకాన్ని రెండు నెలలు ముందుగానే పూర్తి చేసామని అన్నారు.

# మోటర్లకు మీటర్లు రైతులకు ఉరితాడు

**కౌతాళం**




రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జ్ లు తగ్గాలంటే తుగ్లక్ పాలన నడుపుతున్న జగన్ మోహన్ రెడ్డి దిగిపోవాలని , మోటార్లకు మిటర్లు రైతులకు ఉరితాడు విద్యుత్ బదులు 50వేల కోట్ల భారం రైతులపై పడిందని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి అన్నారు. వారు తెలుగు దేశం పార్టీ ఆదేశాలు మేరకు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప తెలుగు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లూరి వెంకటపతి రాజు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొట్రెష్ గౌడ్ ఆధ్వర్యంలో కౌతాళం లో కరెంట్ ఆఫీసు దగ్గర పెంచిన విద్యుత్ చార్జ్ లు తగ్గించాలని తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆనంతరం ఏ ఈ నరసన్న కు వినతి పత్రాన్ని అందజేశారు.

## మాతృత్వాన్ని చాటుకున్న మహిళా కానిస్టేబుల్



**రంగారెడ్డి :**

గండిపేటలో ఓ మహిళా కానిస్టేబుల్ మాతృత్వాన్ని చాటుకున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఎస్ఐ ప్రిలిమినరి రాత పరీక్ష జరిగింది. గండిపేట ఎంజీఐటీ కళాశాల సెంటర్ వద్దకు అఖిల అనే అభ్యర్థి రెండు నెలల పసికందుతో చేరుకుంది. తల్లి పరీక్ష కేంద్రంలో పరీక్ష రాస్తుండగా చంటి బిడ్డను మహిళా పోలీస్ తన ఒడిలోకి తీసుకొని లాలించింది. రెండు నెలల పసి కందును లాలీ లాలీ అని లాలిస్తూ మహిళా కానిస్టేబుల్ కన్యా కుమారి డ్యూటీ చేసింది. పోలీసులు లాఠీలు ఝుళిపించడమే కాదు, అవసరమైతే విధి నిర్వహణలో చిన్నారులకు అమ్మగా మారిపోతానని నిరూపించింది. ఇలా పరీక్ష పూర్తి అయ్యేంత వరకు చిన్నారిని మహిళా కానిస్టేబుల్ తన ఒడిలో లాలించింది.

## కేసీఆర్ ది నియంత పోకడ-జూపల్లి

**హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు రావడం సంతోషంగా ఉందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అయనను పార్టీనుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ను సూటిగా ప్రశ్నిస్తున్న. మీ వంద మాగదులతో ప్రెస్ మీట్ ఎందుకు పెట్టించారు. నాకు భయపడి సస్పెండ్ చేశారా. మీ బండారం బయట పడుతుందని సస్పెండ్ చేశారా. పారదర్శకంగా పాలన చేయాల్సిన భాధ్యత సీఎం పై ఉంది. నా రాష్ట్రం నా ఇష్టం అన్నట్లు సీఎం వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అందరి పాత్ర ఉంది. వినాశ కాలే విపరీత బుద్ధని విమర్శించారు.
మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఫోటో, కెసిఆర్ ఫోటో మా ఇంట్లో ఉంది. మా ఇంట్లో ఎవరి ఫోటోలు ఉండాలో వీళ్ళు చెబుతారా. నాకు మూడేళ్లుగా సభ్యత్వ పుస్తకాలు ఇవ్వకపోయినా కెసిఆర్ ఫోటో మా ఇంట్లో ఉందని అయన అన్నారు.

## శ్రీ నరసింహ స్వామి రాజగోపురంలకు విరాళాలు

**కౌతాళం**



శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కొరకు కంబలపాడు ( క్రిష్ణగిరి మండలం) వాస్తవ్యులు సద్దాల లక్షయ్య డ సన్స్ ఖీబ.1,00,011/- విరాళంగా ఆలయ అధికారులు కు అందజేశారు. మరియు శాశ్వత అన్నదాన కార్యక్రమాలకు గుంతకల్ వాస్తవ్యులు వీరేష్ కుమార్ బాబు 50 వేల రూపాయలు విరాళంగా అందించారు. దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్ మరియు శ్రీ స్వామి వారి ఫోటోను అందించి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, నాగరాజ్ స్వామి మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి నూతన కమిటీలు

**మదనపల్లె**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని... ఆ పార్టీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.... రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేసి... 6 సూత్రాల పథకాలను ప్రవేశపెడతామని వెల్లడించారు. నియోజకవర్గాల్లో ఉన్న పాత కమిటీలను పూర్తిగా రద్దుచేసి వాటి స్థానంలో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విభజన హామీలు అమలు చేస్తామని,రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోందన్నారు.బీజేపీ మత విద్వేషాలతో కూడిన విభజన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వపాలన చేస్తున్నారని మండిపడ్డారు.

## మా జాబు ఎక్కడన్నా ?

**అమలాపురం**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మరియు యువ మోర్చా జిల్లా ఇంచార్జ్ మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జగనన్న మా జాబ్ ఎక్కడన్నా అనే నినాదంతో కలెక్టర్ ను కలిసి వెంటనే జాబ్ కాలండర్ అమలు చేయాలని ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా బిజెపి అధ్యక్షులు కర్రి చిట్టిబాబు హాజరై జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలన్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కాశీన ఫణీంద్ర, యువ మోర్చా నాయకులు కొండేటి ఈశ్వర్ గౌడ్,అమలాపురం టౌన్ యువమోర్చా అధ్యక్షులు ఎన్ శ్రీరామ్,ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జ్ దూరి రాజేష్, అమలాపురం అసెంబ్లీ కన్వీనర్ అయ్యల భాష, అమలాపురం పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి అరిగెల తేజ వెంకటేష్, అమలాపురం రూరల్ యువమోర్చా ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి ఆస్పత్రికి మహర్దశ

**హైదరాబాద్ :**

అమిర్‌పేట నేచర్ క్యూర్ ఆసుపత్రిని ప్రభుత్వం రూ. 10 కోట్లతో అభివృద్ధి చేసింది. ప్రకృతి వైద్యాన్ని బలోపేతం చేయడం కోసం అత్యాధునిక వసతులతో ఆసుపత్రిని పునరుద్ధరిం చారు. కరోనా వంటి క్లిష్టసమయంలో అద్భుతమైన సేవలు అందించిన నేచర్ క్యూర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు మంత్రి హరీష్ రావు. అత్యాధునిక సౌకర్యాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అధ్యయన నివేదిక ప్రకారం ప్రకృతివైద్యంలో ఈ ఆసు పత్రిని నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైద్యరంగంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ.. ఆయుష్ చికిత్సలోనూ అగ్రస్థానంలో ఉండాలనేది సీఎం కేసీఆర్ ఆలోచన అన్నారు. సనాతన భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయని హరీష్ రావు తెలిపారు. వికారాబాద్, భూపాలపల్లి, సిద్ధిపేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని వెల్లడించారు.సాధారణంగా ఏ చిన్న హెల్త్ ప్రాబ్లం వచ్చినా అలోపతి వైపు పొలోమని పరుగులు పెడతాం! వేలకు వేలు సమర్పించుకుని, లక్షలకు లక్షలు ధారపోసి, వెంటిలేటర్ నుంచి బతుకుజీవుడా అని ఇంటిలెటర్ వైపు వస్తాం! అదికూడా లక్కు బాగుంటేనే! ఆ తర్వాత సైడ్ ఎఫెక్టులు, వీక్లీ చెకప్పులు, మింగలేని కక్కలేని మందులు, వాటికోసం వందలు వేలు అప్పులు! ఇదీ నయాజమానా తీరు! ఇందులో ఎవరినీ తప్పు పట్టడానికి లేదు! ఎవరి ఆప్షన్ వాళ్లది! ఎవరి యాక్షన్ వాళ్లది! అలాంటి డిమాండున్న సిట్యువేషన్‌లో, ప్రకృతి వైద్యానికి స్పేస్ లేదు! కానీ ఆ స్పేస్‌ని లాక్కుంది అమిర్‌పేట నేచర్ క్యూర్ హాస్పిటల్! ప్రకృతిని ఒకచేతపట్టి, సంజీవనిని మరోచేత పట్టుకుకుని సగర్వంగా నిలబడింది!అమీరుపేట డీకే రోడ్డులో రైల్వే లైనుకు ఆనుకుని, పచ్చటిచెట్ల నడుమ ఉంటుంది. ఇలాంటి హాస్పిటలొకటి ఇక్కడ ఉందంటే నమ్మశక్యం కాదు! 10 ఎకరాల సువిశాల స్థలంలో, 1949లో ఏర్పాటు చేశారు. ఇందులో మూడు కేటగిరీల్లో పేషెంట్లకు సేవలందిస్తారు. 1- జనరల్ వార్డు, 2- స్పెషల్ వార్డు, 3- కాటేజీలు! మామూలు రోజుల్లో ఎంతమందికి ఈ హాస్పిటల్ తెలుసో లేదోకానీ, కరోనా తర్వాత ఒక్కసారిగా దీని విలువేంటో తెలిసొచ్చింది. ఎందుకంటే కోవిడ్ టైంలో ఈ ఆసుపత్రి అమ్మకంటే ఎక్కువ లాలించింది. ఇంటివారి కంటే ఎక్కువ ఆదరించింది. వీరు అందించిన క్వారెంటైన్ సేవలను పేషెంట్లు ఎప్పటికీ మరువలేరు. ఆ సంక్షోభ సమయంలో అయినవారు సైతం దూరంగా ఉంటే, నేచర్ క్యూర్ ఆసుపత్రి మేమున్నామంటూ చేయిచాచింది. వైద్యులు, సిబ్బంది బంధువులై సపర్యలు చేశారు. 8 వేలకు పైగా కరోనా పాజిటివ్ పేషెంట్లకు క్వారెంటైన్ సేవలు అందించిన ఘనత ఈ ఆసుపత్రి సొంతం. మూడు పూటలా పౌష్టికాహారం, కషాయం, మందులు ఇస్తూ, యోగా చేయిస్తూ, కోవిడ్ పేషెంట్లకు సొంతింట్లో ఉన్నామన్న అనుభూతిని కలిగించింది. 30 వేలకు పైగా పరీక్షలు నిర్వహిం చింది. ప్రతి సంవత్సరం 3000 మంది ఇన్ పేషెంట్లు, 10 వేల మంది ఔట్ పేషెంట్లు ఈ హాస్పిటల్ రికార్డు! కాటేజీ కావాలంటే కనీసం నెల రోజుల ముందు బుక్ చేసుకోవాలి! వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ చికిత్స పొందుతుంటారు. ప్రకృతితో వైద్యం, పంచభూతాలతో వైద్యం. పూర్తి భారతీయ వైద్య సిద్ధాంతం. ఆయుర్వేదం, నేచురోపతి, యోగా, హోమియోపతి, యునాని, సిద్ధ పద్ధతిలో చికిత్స అందిస్తుంటారు. నేచురోపతి అంటే కంప్లీట్ డ్రగ్ లెస్ హీలింగ్ సిస్టం. పూర్తిగా సహజ పద్ధతిలో దీర్ఘకాలిక రోగాలకు చికిత్స అందిస్తారు. డయాబెటిస్, బీపీ, ఆర్థరైటిస్, మోకాళ్ల నొప్పులు, పీసీఓడీ, నడుంనొప్పులు, పెరాలిసిస్, సయాటిక, అధికబరువు, థైరాయిడ్, డిస్క్ సమస్యలు, సోరియాసిస్ ఇలా అనేక క్రానిక్ డిసీజ్‌లకు సైతం చికిత్స ఉంటుంది. సౌర చికిత్స, జలచికిత్స, మర్దన చికిత్స, మట్టి చికిత్స లాంటివి ఇందులో స్పెషాలిటీ. మొత్తం తొమ్మిది రకాల థెరపీలు ఇక్కడ అందిస్తారు. ఇవన్నీ నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో జరుగుతుంటాయి.

మానిపులేటివ్ థెరపీ (మసాజ్)హైడ్రో థెరపీ
మడ్ థెరపీ
క్రోమా థెరపీ
యోగా థెరపీ
ప్రాణాయామం
ఫిజియోథెరపీ
మాగ్నెటోథెరపీ
డైట్ థెరపీ

మారిన జీవన శైలి మనిషి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నది. టార్గెట్లవైపు తీస్తున్న పరుగు ఆయుష్షుని లాగేస్తున్నది. క్రమంగా లైఫ్ స్టైయిల్ డిసీజెస్ బారిన పడుతున్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను పట్టించుకోకుండా, పెద్దరోగాలకు ద్వారాలు తెరుస్తున్నారు. అలాంటి వారికి నేనున్నానని నేచర్ క్యూర్ ఆసుపత్రి స్వాగతం పలుకుతున్నది. ఈ హాస్పిటల్‌కి వస్తే మందుల వాసన రాదు. మట్టివాసన అనుభూతి కలుగుతుంది. ఈ వార్డుల్లో తిరుగుతుంటే ఇన్‌ఫెక్షన్ భయం ఉండదు.. ఇమ్యూనిటీ పెరుగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ హాస్పిటల్ ఆవరణలో ఉంటే అవయవాలన్నీ మన ఆధీనంలో ఉన్నాయన్న ధైర్యం కలుగుతుంది. ఇక్కడి గాలి ఔషధమే. ఇక్కడి నీరు ఔషధమే, మట్టి ఔషధమే, నిప్పు ఔషధమే! పంచభూతాలన్నీ పరమౌషధాలుగా మారుతాయి. ఇక్కడికి వస్తే ఏదో పిక్నిక్ స్పాట్‌కి వచ్చినట్టు విహారయాత్రలో తిరుగు తున్నట్టు.. ఇంటికి వెళ్లకుండా ఇక్కడే ఉండిపోతే బాగుండు.. అనిపిస్తుంది. ముఖ్యంగా సైడ్ ఎఫెక్ట్స్ అనే మాటే ఉండదిక్కడ. ఇన్ పేషెంటుగా ఉన్న వారికి మంచి భోజనం అందిస్తారు. వారివారి రోగాలకు సంబంధించిన చికిత్సలో భాగంగా ప్రత్యేక ఆహారం అందిస్తారు. నూనెలు, మసాలాలు, ఉప్పు, కారాలు లేకుండా ఉంటాయి. జ్యూస్, సలాడ్ వంటివి టైం టు టైం అందిస్తారు. బరువు తగ్గాలనుకున్న వారికి పత్యేకంగా లిక్విడ్ డైట్ అందిస్తారు. 1949లో స్థాపించిన ఈ ప్రకృతి చికిత్సాలయం, ప్రకృతి వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా ఉంది. దీనికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాలలో చదువుకున్న వారు దేశంలోని ప్రముఖ ప్రకృతి చికిత్సా లయాల్లో పని చేస్తుండటం మరో చెప్పుకోదగ్గ విషయం.

# జూపల్లికి నైతికత లేదు

**మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**హైదరాబాద్**

మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు,మాజీ ఎంపీ శ్రీనివాస్ రెడ్డి ఇద్దరూ పార్టీ కంటే మేమే గొప్ప అన్నట్లు వ్యవహరించారని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం అయన మీడియాతో మాట్లాడారు.వ్యక్తుల కంటే పార్టీనే గొప్ప అని బిఆర్ఎస్ భావిస్తుంది. వాళ్ళ బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ కు బిఆర్ఎస్ లొంగదు. వారు కోరుకున్నది జరగడంలేదని...వారు ఆశించిన పదవులు రాలేదని వ్యక్తిగత ధోరణి ప్రదర్శిస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పైనే విమర్శలు చేసే స్థాయికి వచ్చారు. అన్ని అలోచించిన తర్వాతే పొంగులేటి, జూపల్లి పై కేసీఆర్ వేటు వేశారు. అనుకున్న లక్ష్యం కోసం కేసీఆర్ గతంలో తనను విమర్శించిన వారికి సైతం అనేక అవకాశాలు కల్పించారు. పార్టీలో వున్న వారిని పోగొట్టుకోవాలని ఎవరు భావించరు. జూపల్లి 2012 లో బిఆర్ఎస్ లో చేరారు.

జూపల్లి కృష్ణారావు కు నైతికత లేదు. నాడు కాంగ్రెస్ ను వదిలి బిఆర్ఎస్ లో చేరితే జూపల్లిని కేసీఆర్ మంత్రిని చేశారు. పార్టీలో జూపల్లి అన్ని పదవులు అనుభవించి నేడు విమర్శలు చేస్తున్నారు. తన వ్యక్తిగత స్వార్థం కోసమే జూపల్లి కేసీఆర్ పై విమర్శలు చేశారు. జూపల్లి మాట్లాడేదానిలో అర్థం లేదు...తెలంగాణలో అమరవీరుల ఆశయాలు నెరవేరకపోతే జూపల్లి ఎందుకు మంత్రిగా పని చేశారు. కేసీఆర్ పథకాలను పొగుడుతూ జూపల్లి మాట్లడలేదా. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా...రెండు సార్లు మంత్రిగా పని చేసిన జూపల్లి నీళ్లు తీసుకురాకుండా ఏం చేశారు. పొంగులేటి,జూపల్లి ఎవరి ట్రాప్ లో వున్నారో అందరికి తెలుసు. వచ్చే ఎన్నికల్లో అందరి బండారం బయటపడుతుంది. కేసీఆర్ ను విమర్శించి బయటకు వెళ్లిన వారు...ఎవరు రాజకీయాల్లో నిలబడలేదు. పొంగులేటి, జూపల్లి వెళ్లినా బిఆర్ఎస్ బలహీనపడదు. తెలంగాణ ఉద్యమానికి,ప్రస్థానానికి పొంగులేటికి సంబంధం లేదు. జగన్ ముఖ్యమంత్రి కావాలని నాడు ఉమ్మడి రాష్ట్రంలో జూపల్లి మంత్రి పదవికి రాజీనామా చేస్తా అని అనలేదా. తెలంగాణలో జూపల్లి మంత్రి అయిన తర్వాత సైతం తన ఇంట్లో వైఎస్ ఫోటో పెట్టుకున్నారు. జూపల్లి మంత్రిగా కొల్లాపూర్ నియోజకవర్గంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడితే కేసులు పెట్టించి...వైఎస్ విగ్రహాలు పెట్టించారు. ఆంధ్ర నుండి వచ్చి ఇక్కడ పార్టీలు పెట్టిన వారి మాటలను పొంగులేటి, జూపల్లి మాట్లాడుతున్నారు. నాలుగున్నర లక్షల కోట్లను ఒక్క వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఖర్చు పెట్టింది. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలు వున్నాయా జూపల్లి,పొంగులేటి సమాధానం చెప్పాలని అన్నారు.నాడు వైఎస్ హయాంలో తెలంగాణకు నీళ్లు వచ్చాయా...జూపల్లి సమాధానం చెప్పాలి. కేసీఆర్ వచ్చాక పాలమూరుకు నీళ్లు వచ్చాయని నాడు జూపల్లి చెప్పలేదా. జూపల్లి,పొంగులేటి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించమని అన్నారు.జూపల్లి కొల్లాపూర్ లో ఓడిపోతే కేసీఆర్ తప్పు ఎలా అవుతుంది. జూపల్లిది రాజకీయ దిగజారుడుతనం కాదా. తప్పనిసరి పరిస్థితుల్లోనే కేసీఆర్ వారిపై నిర్ణయం తీసుకున్నారని మంత్రి అన్నారు.

# బిల్లులను గవర్నర్ పెండింగ్ లో పెట్టడం దారుణం

**మంత్రి హరీష్ రావు**

**సిద్ధిపేట**

కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర ప్రతి పత్తి కలిగిన సంస్థలను కూడా వాడుకుంటుంది. గవర్నర్ బిల్లులను పెండింగ్ లో పెట్టడం దారుణమని మంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. కోర్టులో కేసులు వేస్తే కానీ బిల్లులు పాస్ కానీ పరిస్థితి తెలంగాణలో ఉంది. మంత్రులు కలిసినా గవర్నర్ బిల్లులను ఆమోదించట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెళ్లి సుప్రీం కోర్టు మెట్లు ఎక్కితే కానీ బిల్లులు పాస్ కానీ పరిస్థితి వుంది. అన్ని వ్యవస్థలను బిజెపి ఆధీనంలో పెట్టుకుంటుంది. ఫారెస్ట్ యూనివర్సిటీ పెట్టుకుంటే క్యాబినెట్ ఆమోదించింది. గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి దగ్గర పంపారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడమేనని అయన అన్నారు.

పిల్లల భవిష్యత్ తో బిజెపి చేలాగాటం ఆడుతుంది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తే.. గిన్నీ నోటిఫికేషన్ల అంటారు. పేపర్లు లీక్ చేసి విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేసిర్రు. పిల్లలు భవిష్యత్ కంటే మీకు రాజకీయాలు ముఖ్యం. గవర్నర్ గారు ఇది కరెక్టేనా అని అడుగుతున్నా. ఒక ఫారెస్ట్ యూనివర్సిటీ వస్తే మీకు ఇబ్బంది ఏంటి. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారు. వెనుక నుంచి బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు.

# కడగొమ్మును కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ఆర్డీఓ కు వినతి పత్రం అందజేసిన రైతులు**

**పత్తికొండ**



పత్తికొండ చెరువు తూమును, కడుగొమ్మును వైసీపీ నేత కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి నిర్మాణాలను పత్తికొండ పట్టణ రైతులు ఆర్డీఓ మోహన్ దాస్ ను కోరారు. సోమవారం స్పందనలో అయనన్ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలో సర్వేనెంబర్ 602-2 లో 184.5 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందన్నారు. వర్షాకాలంలో చెరువుకు అధికంగా నీరు వస్తే బయటకు వెళ్లడానికి కడుగోమును ఏర్పాటు చేశారన్నారు. ఈ కడుగోమ్ము ముందు 1.5 ఎకరాలు ఖాళీ భూమి ఉందన్నారు. దీని విలువ మార్కెట్లో రెండు కోట్లు వరకు ఉందన్నారు. దీనిని ఆక్రమించేందుకు పట్టణానికి చెందిన అధికార పార్టీ కి చెందిన సాబ్దిన్ నూర్ భాషా పథకం పన్నాడన్నారు ఆ స్థలంలోకి చెరువు కదుగొమ్ము నీరు రాకుండా చెరువు మట్టిని తవ్వి రాత్రికి రాత్రే చదును చేయుంచారాన్నరు. దీనిపై వివిధ వార్తాపత్రికల్లో వరుస కథనాలు కూడా రావడం జరిగిందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఇరిగేషన్ జిల్లా అధికారి, డివిజన్ అధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో వచ్చి చెరువు కబ్జా చేసినటువంటి స్థలాన్ని పరిశీలించి వారంలోపు పూర్వం చెరువు తూమును కడుగుమును యధావిధిగా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ఇప్పటివరకు నెరవేరలేదన్నారు. సాక్షాత్ జిల్లా కలెక్టర్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించి కబ్జా జరిగిన చెరువు ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించినా ఇంతవరకు చర్యలు లేవన్నారు. ఇంత పెద్ద ఎత్తున మట్టి వేసి చెరువు కడగొమ్ము తూము ప్రాంతాలను పూడ్చివేస్తుంటే సంబంధించిన మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సామాన్య రైతులు ఒక ట్రాక్టర్ మట్టి చెరువులో నుండి తీసుకొని వెళ్తే కేసులు నమోదు చేసి ట్రాక్టర్లు సీజ్ చేసే అధికారులు ఇంత పెద్ద ఎత్తున మట్టి వేసి చెరువును తూమును కదుగొమ్మును పూడ్చి వేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు. గతంలో చెరువు తూము కడగొమ్ము ప్రాంతం ఎలా ఉంటే అలా చేయాలని మైనర్ ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించిందన్నారు. చెరువు కబ్జా చేసేందుకు వేసిన మట్టిని వారం రోజుల్లోగా తొలగించాలని, లేకపోతే సంబంధించిన శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారన్నారు. ప్రభుత్వ స్థలాలను తమ పార్టీవారైనా, వేరే ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికైనా మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి చెరువు కబ్జా చేసినటువంటి వ్యక్తిపై క్రిమినల్ చర్యలు తీసుకొని, అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేయకుండా ఆపాలని రైతులు ఆర్డీఓ ను కోరారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన వైకాపా ఎమ్మెల్సీ

**బద్వేలు**




గోపవరం మండలంలో 2.25 కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులను బద్వేల్ మాజీ ఎమ్మెల్యే వైకాపా ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్య వైద్యము వ్యవసాయము రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు ప్రతి పేదవాడు తమ పిల్లలను బడికి పంపించి బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకు రావాలని ఆశపడతారని వారి ఆశ తీర్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు విద్యా విధానంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రవేట్ దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ఇంటింటికి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు ఆర్.బి.కెల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ఎరువులు మందులు అందించడం చేస్తున్నట్లు తెలిపారు సంక్షేమము అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రెండు కళ్ళు లాంటివని ఆయన పేర్కొన్నారు ప్రజల వద్దకే పాలన అందించాలని ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలకు దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేసి పక్కా భవనాలు నిర్మించినట్లు తెలిపారు

# నిరుద్యోగులను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

**నెల రోజుల్లో మెగా జాబ్ క్యాలండర్ ప్రకటించకుంటే ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్థాం**

**బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్.బైరెడ్డి శబరి**

**నంద్యాల**

ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకుంటున్నారని, నాలుగేళ్లుగా ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీచేయకుండా మోసం చేస్తున్నారని, మెగా జాబ్ క్యాలెండర్ నెల రోజుల్లో ప్రకటించి ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేపట్టకుంటే బిజెవైఎం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తామని బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్. బైరెడ్డి శబరి హెచ్చరించారు.సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముందు అన్నా ఓ జగనన్నా ఎక్కడన్నా మా జాబ్ లు అంటూ బిజెవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్. బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 2.35 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వ లెక్కలే తెలుపుతున్నాయని అన్నారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి ఓట్లు దండుకొని ముఖ్యమంత్రి అయ్యి నాలుగేళ్లు గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని, వాలంటీర్ జాబ్ తో నెలకు ఐదు వేల రూపాయలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు.మెగా డిఎస్సీ ఏమైనదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్



చేస్తామన్న జగన్ హామీ ఎందుకు అమలు చేయలేదని ఆమె నిలదిశారు. మెగా జాబ్ మేళాలతో నిరుద్యోగ యువతను జగన్ ప్రభుత్వం మభ్యపెడుతోందని విమర్సించారు.ఉన్నత చదువులు చదివి అటు ఇళ్ల వద్ద పనులు చేసుకోలేక ఇటు ఉద్యోగం లేక నిరుద్యోగులు మానసికంగా కుంగిపోతున్నారని, ప్రభుత్వం మద్యం షాపులు, చికెన్, మటన్ దుకాణాలలో ఉద్యోగం చేయించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిరుద్యోగ యువత ఆవేశం, ఆగ్రహానికి గురిఅ వుతున్నారు, వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంను కుప్ప కూల్చేందుకు సిద్ధంగా ఉన్నారని అందుకు ఉదాహరణ ఇటీవల రాష్ట్రంలో జరిగిన పట్టభద్రుల ఎన్నికలే నిదర్శనం అని బైరెడ్డి శభరి అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెవైఎం నంద్యాల జిల్లా అధ్యక్షులు చైతన్య కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరావు, కార్యదర్శులు మహేష్, మనోజ్, చంద్రపాల్ నాయుడు, రాష్ట్ర సభ్యులు వెంకట్ తో పాటూ జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు డిమాండ్ల తో కూడిన వినతి పత్రం అందజేశారు.

# విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల దోపిడీ

**మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ విమర్శ**

**గాజువాక**

గడచిన నాలుగు సంవత్సరాలుగా ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలను పెంచి ఈ రాష్ట్ర ప్రజలపై 56 వేల కోట్ల రూపాయలు ఆర్థిక భారం మోపి.. ప్రజల సొమ్ము దోపిడి చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గాజువాక నియోజవర్గం మాజీ శాసనసభ్యులు విశాఖ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఈరోజు రాష్ట్ర పార్టీ ఆదేశాలు పురస్కరించుకొని కొత్త గాజువాక జంక్షన్ లో గాజువాక నియోజవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని వైసిపి ప్రభుత్వం తీరును తప్పు పట్టారు పట్టారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఈ రాష్ట్ర ప్రజల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్న బేషరతుగా పెంచిన విద్యుత్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో ప్రజలందరూ సైకో పోవాలి సైకిల్ రావాలని. ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు. గౌరవ శాసనసభ్యులు మంత్రులలో తన స్థాయి మరిచి గోడకు స్టిక్కర్లు అంటించి స్థాయికి దిగజార్చారని అన్నారు.. రాష్ట్ర ప్రజలందరూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి దరిద్రం అని అభిప్రాయానికి వచ్చారని విమర్శించారు చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే. మరో మహా ఉద్యమాన్ని స్వీకారం చెడుతోనే హెచ్చరించారు.

# రెబల్ స్టార్ ప్రభాస్, నాగ్ అశ్విన్, 'ప్రాజెక్ట్ ఐ' ఫ్రమ్ స్క్రాచ్ ఎపిసోడ్ 2: అసెంబ్లింగ్ ది రైడర్స్ విడుదల

రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్ ఐ' క్రియేటివ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఇండియన్ మూవీ. ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. యూనిట్ యూనిక్ ప్రమోషనల్ కాంపెయిన్ ప్రారంభించింది. అందులో భాగంగా ఫ్రమ్ స్క్రాచ్ పేరుతో ప్రీ ప్రొడక్షన్ పనుల వీడియోను విడుదల చేస్తున్నారు. ఎపిసోడ్ వన్- ప్రత్యేకంగా రూపొందించిన చక్రం తయారీని చూపించింది. ఈరోజు, ఎపిసోడ్ 2- అసెంబ్లింగ్ ది రైడర్స్‌ని విడుదల చేసారు. రైడర్స్ ఎవరు? చర్చల తరువాత అది విలన్ ఆర్మీ యూనిఫాం సైన్ అని రివిల్ అవుతుంది. ఇది సినిమాలో అత్యంత ఖరీదైన భాగమని నిర్మాత తెలియజేశారు. దర్శకుడు నాగ్ అశ్విన్ స్క్రిప్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా ఈ సినిమా మరో లెవల్‌గా ఉండబోతోంది. 50 మెమరబుల్స్ ఇయర్స్ జరుపుకుంటున్న టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఈ



గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది . అశ్విని దత్ నిర్మాత. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రాజెక్ట్ ఐ జనవరి 12, 2024న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సుహాస్ హీరోగా తెరకెక్కుతున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' అనౌన్స్మెంట్ పోస్టర్ విడుదల

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతోన్న సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు మరియు దర్శకుడు వెంకటేష్ మహా ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ , 18 పేజెస్ లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా "అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు".

షార్ట్ ఫిల్మ్స్ తో కెరియర్ మొదలు 'కలర్ ఫోటో' సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు సుహాస్. కేవలం యూత్ కి నచ్చే కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు మాత్రమే కాకుండా, రీసెంట్ గా 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమా చేసి ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా దగ్గరయ్యాడు సుహాస్. ప్రస్తుతం సుహాస్ హీరోగా చేస్తున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మూవీ ఇప్పుడు షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. జీఏ2 పిక్చర్స్, స్వేచ్ఛ క్రియేషన్స్, వెంకటేశ్




మహా నిర్మాణంలో దుశ్యంత్ కటికనేని ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు.

మ్యారేజ్ బ్యాండ్ లో పనిచేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ ఈ సినిమాలో నటిస్తున్నాడ. ఈ వేసవిలో మోత మోగించడానికి మల్లిగాడు వచ్చేస్తున్నాడంటూ చిత్ర యూనిట్ ఓ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మూవీ ఫస్ట్ లుక్ ను రేపు (11-04-2023) రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ ను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్ర బృందం.







Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950